www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 01 | జూలై | 2025 పేజీలు : 8

## జిల్లా విద్యాశాఖాధికారిని సస్పెండ్ చేయండి



-క్రీడా మైదానం లేకుండానే అనుమతులు ఎలా ఇచ్చారు
-పుస్తకాలు, యూనిఫామ్ అధిక ధరలకు విక్రయిస్తున్నా పట్టించుకోని అధికారులు

2 లో

# ఆ ఐదు పంచాయతీల అరిగోస..!



- ప్రజలకు శాపంగా మారిన విభజన తప్పిదాలు
- కుంటుపడ్డ భద్రాద్రి అభివృద్ధి
- ఏళ్ల తరబడి నలిగిపోతున్నప్రజలు
- మోడినోట మన్‌కి బాత్‌లో భద్రాద్రి మాట
- అమిత్‌షాకు విన్నవించిన మంత్రి తుమ్మల
- ఇకనైనా కరుణిస్తే మేలు

**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన... ఆ ఐదు పంచాయితీలకు తీరని నష్టాన్ని, కష్టాన్ని మిగిల్చింది.** వారి అరిగోస చెప్పనలవి కాకుండా ఉంది. రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లు అవుతున్నా ఆ సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. రామాలయం ఒకవైపు రాముని మాన్యం మరోవైపు... ఈ విభజన గాయాలు భద్రాద్రి అభివృద్ధిని ఇంకా బాధిస్తూనే ఉన్నాయి. ఆ శాస్త్రీయ విభజన కారణంగా ప్రజలు, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యా వైద్యంతో పాటు భౌగోళిక, సాంకేతిక, రాజకీయ, చట్టం పరమైన అనేక సమస్యలు చెప్పనలవి కాదు. ఇప్పటికైనా కేంద్రం కరుణిస్తే మేలని పలువురు కోరుతున్నారు.

-ప్రజాపక్షం/భద్రాచలం

2 లో

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి



- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరణ
- జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశం

ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారులు అత్యంత ప్రాధాన్యగా భావించి, ఈకార్యక్రమానికి స్వయంగా హాజరు కావాలని అన్నారు. ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిష్కరించాలని, జిల్లా అధికారులు తమ పరిధిలోని సమస్య పరిష్కారం వెంటనే చేయాలని లేని పక్షంలో దరఖాస్తుదారునికి పరిస్థితి తెలపాలని సూచించారు.

మిగతా 2లో..

### రాహుల్ గాంధీ ఆలోచనలనే

## కేంద్రం అమలు చేస్తోంది



- దేశవ్యాప్త కులగణనకు కేంద్రం సిద్ధ పడటం శుభ పరిణామం
- రాష్ట్రాభివృద్ధి కోసం సిఎం రేవంత్ కష్టపడుతున్నారు
- ఖమ్మం జిల్లా ఆడబిడ్డ సత్తా ఏంటో చూపిస్తా
- రాజ్యసభ ఎంపి రేణుక చౌదరి

ప్రజాపక్షం/ఖమ్మం : రాహుల్ గాంధీ ఆలోచనలు చాలా గొప్పగా ఉంటాయని, అందుకే కేంద్రం రాహుల్ ఆలోచనలను అమలు చేస్తోందని రాజ్యసభ ఎంపి రేణుణ చౌదరి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన విజయవంతం కావడంతో మోడి దేశవ్యాప్తంగా చేసేందుకు ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారని,

మిగతా 2లో..

# ఆ ఐదు పంచాయతీల అరిగోస..!

ప్రజాపక్షం/భద్రాచలం : ఇంటిగుట్టు లంకకు చేటన్న చందంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చిచ్చు ఇప్పుడు బీజేపీపై విమర్శలు గుప్పించే పరిస్థితికి తెచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాడు ఆంధ్రప్రదేశ్‌ను రెండు ముక్కలు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా పోలవరం పేరుతో భద్రాచలం మండలంలోని ఏడు మండలాలను ఏపిలో కలిపిన అప్పటి విభజన పెద్దలు పోలవరంకు ఎలాంటి సంబంధంలేని పూర్వ భద్రాచలంలోని ఐదు గ్రామ పంచాయితీలైన ఎటపాక,పిచుకలపాడు కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం, గుండాల(పోలవరం ప్రమాదం ఉంటుంది) ఏపిలో కలవడంతో ఇక్కడి ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తెలంగాణ రాష్ట్రానికి ప్రక్కనే ఉన్న ఆ ఐదు పంచాయితీల వారు విదేశీయులుగా అక్కడ బ్రతకాల్సిన పరిస్థితులు తలెత్తాయి.

**శాపంగా మారిన విభజన తప్పిదాలు...**

ఉవ్వెత్తున లేచిన తెలంగాణ మలిదశ ఉద్యమంతో అప్పటి యూపిఏ2 ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వక తప్పలేదు. ఇదిలా ఉండగా రాష్ట్రాన్ని విభజించిన భద్రాచలం పట్టణం మినహా పూర్వ మండలం మొత్తం ఏపిలో కలిపారు. ఇప్పుడు ఇక్కడి పరిస్థితి ఎలా ఉంది అంటే నీ ముక్కు ఎక్కడా అంటే తలచుట్టూ వేలు తిప్పి ముందుకు చూపిన చందంగా ఉంది. భద్రాచలం పట్టణాన్ని ఆనుకుని ఏపి ఉంది. ఇది 9 కి.మీ పొడవునా సాగిన తర్వాత మళ్లీ అదే రోడ్డుపై తెలంగాణ రాష్ట్రం కొనగుతుంది.అంతే కాకుండా ఐదు పంచాయితీలు కూడా ఏపిలోనే ఉన్నాయి. పురుషోత్తపట్నం పంచాయితీలో రామాలయానికి సంబంధించిన రాముని మాన్యం 917 ఎకరాలు ఉంది. ఇప్పుడు రాముడు తెలంగాణలో ఉంటే రాముని ఆస్తులు ఏపిలో ఉన్నాయి. అభివృద్ధి చేసుకుందామంటే కుదరని పరిస్థితి. దీంతో భద్రాచలం అభివృద్ధి పెద్ద ఎత్తున కుంటుపడింది. భద్రాచలం రామాలయానికి చెందిన అనేక చారిత్ర ఆనవాళ్ళు సేతం ఏపిలోనే ఉంటం గమనార్హం. అంతే కాకండా రాజకీయ, భౌగోళిక, విద్యా,వైద్యం, సాంకేతిక పరంగా ఈ ఐదు పంచాయితీలు ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ సమస్య వచ్చిన వారు వందల కి.మీ ప్రయాణం చేయాల్సివస్తోంది. ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, రోగులు ఈ సమస్యతో ఏళ్ల తరబడి నలిగిపోతున్నారు.

**బిజేపి నాయకుల మాటేమైంది...**

గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భాల్లో ఓట్ల కోసం ఇక్కడికి వచ్చిన అనేక మంది బిజేపి నేతలు రాష్ట్ర విభజన అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విభజన హద్దులు సరిగా చేయలేదని, దీంతో రాముడు నడయాడిన భద్రాద్రి గడ్డ తీవ్రంగా నష్టపోతోందని అన్నారు. బిజేపి కేంద్రంలో అధికారంలోనికి రాగానే భద్రాద్రి అభివృద్ధికి దోహదపడే ఐదుపంచాయితీలను తిరిగి తెలంగాణలో కలిపేందుకు నేరుగా బిజేపి పెద్దలతో మాట్లాడుతామని ఊకదంపుడు ప్రసంగాలు చేశారు. కానీ నేటికి కూడా ఆ మాటను నిలబెట్టుకుంది లేదు. కాంగ్రెస్ ఆశాస్త్రీయంగా విభజన చేసినప్పటికీ విభజన బిల్లుపై బిజేపి తొలి సంతకం చేసిందికదా అంటూ పలువురు ప్రశ్నల వర్షం కురిపించారు. ఐనప్పటికీ ఒక్క ఆర్డినెన్స్ ద్వారా ఆ ఐదు పంచాయితీలను తెలంగాణకు ఇప్పటికైనా బిజేపి ఇచ్చేయవచ్చని, కానీ అందుకు కనీసం కనీసం ముందుకు రాకపోవడం శోచనీయం అంటూ పలువురు బాహాటంగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా చొరవచూపితే రాముడు నడయాడిన పుణ్యభూమిని అభివృద్ధి చేసుకునేందుకు వీలుంటుందని పలువురు కోరుతున్నారు.

**మన్‌కీ బాత్‌లో మోడినోట భద్రాచలం మాట....**

మాన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడి నోట భద్రాచలం మాట వచ్చింది, గిరిజనులు తయారు చేసే ఇక్కడి మిల్లెట్ బిస్కెట్లపై ఆయన ప్రశంసలు కురిపించారు. కానీ విభజన గాయాలను మాన్పే ఒక్కమాట కూడా మాట్లడలేదు. ఇప్పటికైనా కేంద్రానికి సదుద్దేశ్యమే ఉంటే ఏపిలో వీలినం చేసిన ఐదు పంచాయితీలను తిరిగి తెలంగాణకు ఇచ్చి రామునిపై ఉన్న భక్తిని చాచుకోవాలని పలువురు అంటున్నారు. ఇదిలా ఉండగా కేంద్రహోంశాఖా మంత్రి అమీత్‌షా పర్యటలో భాగంగా రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏపిలో విలీనమైన పంచాయితీలపై , ప్రజలు, విద్యార్థులు పడుతున్న బాధలు, ఇబ్బందులు, భౌగోళిక పరిస్థితులపై రెండు పేజీల లేఖను సమర్పించారు.

**ఇకనైనా కరుణిస్తే మేలు....**

రాష్ట్ర విభజన జరిగి 11సం. అవుతోంది. కానీ ఆ ఐదు పంచాయితీల అరిగోస మాత్రం తీరడం లేదు. ఆ పంచాయితీల్లో ఎవ్వరిని కదిపినా చెప్పనలవి కాని ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. విద్యార్థుల భవిష్యత్ అగమ్య గోచరంగా మారింది. స్థానిక పరిస్థితులు అనుకూలంగా లేవు. ఆరోగ్య సమస్య తలెత్తితే పదరాని పాట్లు పడాల్సివస్తోంది. రాజకీయ,చట్టపరమైన సమస్యలు ఎదురైతే వందలమైళ్ల దూరం ప్రయాణం చేయాల్సిన దుస్థితి. రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవ లేదన్నట్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపి ప్రభుత్వం ఇప్పటికైనా కరుణిస్తే రాముడు నడయాడిన పుణ్యభూమికి, రామాలయణ అనవాళ్లతో సహజీవనం చేస్తున్న ప్రజలకు ఎంతో మేలు చేసినవారు అవుతారని, భద్రాద్రి రామాలయాన్ని మరింత అద్భుతంగా తీర్చిదిద్దుకోవచ్చని విశ్లేషకులు, మేధావులు, కవులు, కళాకారులు, ఉద్యోగులు, వ్యాపారులు, నష్టాన్ని చవిచూస్తున్న ప్రజలు, విద్యార్థులు అంటున్నారు.


# రాహుల్ గాంధీ ఆలోచనలనే కేంద్రం అమలు చేస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాపాలనను చూసి ఓర్వలేని బిఆర్ఎస్ విమర్శలు చేస్తోందన్నారు. ఖమ్మం ఆడబిడ్డనైన నేను జిల్లాను ఎక్కడికీ వెళ్లలేదని, త్వరలో తన సత్తా ఏంటో చూపిస్తా అన్నారు. ఎంతమంది మంత్రులున్నా రేణుక కూడా జిల్లాలో ఉంటుందని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ నేతలకు పోలీసులు కల్పిస్తున్న ఎస్కార్ట్‌ను విరమించుకోవాలని అన్నారు. తెలంగాణాలో కవిత పర్యటనకు డబ్బులు ఎక్కడ్నుంచి వస్తున్నాయని, ఆమె వెనుకాల ఉన్నది ఎవరో తేలాలని అన్నారు. పహల్గాం ఉగ్రదాడి చేసిన నలుగురుని ఇప్పటి వరకు పట్టుకోక పోవడం ముమ్మాటికీ కేంద్ర వైఫల్యమే అన్నారు. సీజ్ ఫైర్‌తో పాకిస్తాన్ చర్చలు చేసిన కేంద్రప్రభుత్వం మావోయిస్టులతో చర్చలకు ఎందుకు ముందుకు రావడం లేదన్నారు. ప్రక్క దేశాలైన నేపాల్, చైనాలతో శత్రుత్వం పొంచి ఉందని, దీనిని కేంద్రం అరికట్టడం లేదన్నారు. ఈ అంశాలన్నింటిని పార్లమెంట్‌లో చర్చిద్దామంటే సమావేశాలు నిర్వహించడం లేదన్నారు. కేంద్ర వైఫల్యాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండగడుతుందనే ఉద్దేశ్యంతోనే పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడం లేదన్నారు. కేంద్రం కుట్రతో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం తెలంగాణకు అన్యాయం జరిగితే ఊరుకోబమన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తి ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మానుకొండ రాధాకిషోర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు సకాలంలో రుణాలను చెల్లించాలి

**వైరా యూనియన్ బ్యాంక్ మేనేజర్ కళ్యాణ్**



ప్రజాపక్షం/వైరా: వైరా మండలంలో రుణాలను తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని వైరా యూనియన్ బ్యాంక్ మేనేజర్ కె.కళ్యాణ్ సూచించారు. సోమవారం మేనేజర్ కళ్యాణ్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన క్రాఫ్ లోన్ రుణాలను రైతులకు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించాలని సూచించారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పిస్తుందని, ప్రధానమంత్రి జీవనజ్యోతి, ప్రధానమంత్రి సురక్ష భీమా యోజనా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అతి తక్కువ వడ్డీతో గోల్డ్ లోన్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు క్రాప్ లోన్ రుణాలను నిబంధనల ప్రకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# జిల్లా విద్యాశాఖాధికారిని సస్పెండ్ చేయండి

ప్రజాపక్షం/ఖమ్మం : ఖమ్మం కవిరాజ్‌నగర్ రోడ్ నెంబర్ 13 లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నారాయణ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న జిల్లా విద్యాశాఖాధికారులను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నారాయణ విద్యాసంస్థల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో నారాయణ పాఠశాల ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు అనుమతులు లేకుండా అక్రమంగా పాఠశాల నిర్వహిస్తున్న నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. పాఠశాలలో ఫైర్ సేఫ్టీ, శానిటరీ, క్రీడా మైదానం వంటి సౌకర్యాలు లేకుండా పాఠశాల నిర్వహణకు రెన్యువల్ అనుమతులు మంజూరు చేస్తున్న విద్యాశాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శానిటరీ , పారిశుధ్యం లేకపోవడం వలన విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణం తనిఖీలు నిర్వహించి నారాయణ పాఠశాల రెన్యువల్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కవిరాజ్ నగర్‌లో నిర్వహిస్తున్న మరొక పాఠశాలలో కూడా క్రీడా మైదానం లేకుండానే పాఠశాల నడుపుతున్నారని ఆరోపించారు గత మూడు సంవత్సరాలుగా ఫైర్ సేఫ్టీ, శానిటరీ అనుమతులు లేకుండానే పాఠశాల అనుమతులు రెన్యువల్ చేసుకుంటున్నారని దీనిపై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నారాయణ పాఠశాల ఆధ్వర్యంలో పుస్తకాలు, యూనిఫామ్, షూస్, టై, బెల్టులు ఇతర వస్తువులు కూడా పాఠశాలలోనే కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులకు హుకుం జారీచేస్తున్నారని దీనిని ఖండిస్తు ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా చేయగా ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజ తనిఖీలు చేసి బుక్ స్టోర్‌ను సీజ్ చేశారని అయినా దొడ్డిదారిన పుస్తకాలు అమ్మకాలు నిర్వహిస్తున్నారని అన్నారు. చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి శివనాయక్, వంశీ, పవన్‌సాయి, ఉమామహేశ్వర రావు, అనిల్‌కుమార్, చంటి, స్టాలిన్, గోపి, రాహుల్, లక్ష్మణ్, నరేందర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం విజయవంతం



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ములకపాడు ప్రాథమి క ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ క్యాంపు ను భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ప్రారంభించారు. ఇం డియన్ రెడ్ క్రాస్ సొసైటి మారుతీ నర్సింగ్ కాలేజ్, లైన్స్ క్లబ్ భద్రాచలం , లైన్స్ క్లబ్ జటావు , వికాస తరంగిణీ ల ఆధ్వర్యంలో ఎం.ఎన్ క్యాన్సర్ ఆసుపత్రి హైదరాబాద్, పుష్పగిరి కంటి ఆసుపత్రి సికింద్రబాద్ సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు.ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం గిరిజన ప్రాంతంలో కంటి సమస్య లతో గర్భకోస, రొమ్ముక్యాన్సర్ తో మహిళలు తీవ్ర ఇబ్బందులు గురౌతులున్నారని ఆయన తెలిపారు.ఆదివాసి గిరిజనుల ఆరోగ్య సంరక్షణ కోసం వీరు చేపట్టిన సేవలు విలువైనవని ఈ సందర్భంగా వారిని అభినందించారు. అనంతరం జిల్లా ఆర్డినేటర్ ఎస్ ఎల్ కాంతారావు మాట్లాడుతూ ఈ శిభిరాన్ని విజయ వంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్క అధికారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో డా. చైతన్య, డిప్యూటి డియం అండ్ హెచ్ ఓ వై సూర్యనారాయణ , ఎ జగదీష్ , శ్రీమతి కమలా రాజశేఖర్ నక్కా వెంకన్న యాదవ్, వి కామేశ్వరరావు, యం సిద్దా రెడ్డి , డా, యుగెందర్ , బానోత్ రాము, ఎంయన్ జె క్యాన్సర్ ఆసుపత్రి ప్రతి నిధి ప్రసాద్ , పుష్పగిరి కంటి ఆసు పత్రి ప్రతినిధి మధు,క్యాన్సర్ నిపునులు డా.పి ప్రజ్ఞ, డా,ఎం మదు మోహన్ రెడ్డి, అప్తాల్మిక్ వైద్యులు జి సంజీవ రావు, బాల కృష్ణ, ఆర్ క్రిష్ణ వేణి, ఆదినారాయణ, మారుతి నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో మానవీయకోణంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అధికారులు పకడ్బందీగా పాటించాలని అన్నారు. ప్రతి వారం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా అధికారులు వారివారి శాఖ పరిధిలో సమీక్ష చేయాలని పరిష్కారం నాణ్యతపై, అదనపు కలెక్టర్ 5శాతం ప్రజావాణి దరఖాస్తులను క్రాస్ చెక్ చేస్తారని అన్నారు. ప్రతి జిల్లా అధికారి తన పరిధిలో జరిగే అభివృద్ధి, సంక్షేమ పనులకు సంబంధించి వివరాల సిద్ధం చేయాలని అన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే సీఎస్ వీడియో సమావేశాలకు అవసరమై నోట్స్ సిద్ధం చేసి, ముందస్తుగా సమర్పించాలని అన్నారు. సోమవారం నాటి ప్రజావాణి ఖమ్మం నగరానికి చెందిన వి.మరీష్, ఖమ్మం కలెక్టరేట్ నందు కంప్యూటర్ ఆపరేటర్‌గా గతంలో ఎన్నికల సెల్ నందు ఔటసోర్సింగ్‌లో పని చేశానని, ప్రస్తుతం ఖాళీగా ఉన్నానని, జిల్లా ఆసుపత్రి సదరం క్యాంపు వద్ద ఖాళీగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ పోస్ట్ నందు ఔటసోర్సింగ్ ద్వారా ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా...ఏఓకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం గ్రామ రైతులు శివారు సర్వే నెంబర్ 378,379 వైపుగా వెళ్లే బండ్ల బాటను కలుపుకొని కంప ఏర్పాటు చేసుకొని కొంత మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారని, దీంతో తమ భూములకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని, బండ్ల బాట యొక్క హద్దులు పునరుద్ధరణ జరిపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహశీల్దార్‌కు రాస్తూ నిబంధనలు ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కామేపల్లి మండలం అడవి మద్దులపల్లి గ్రామానికి చెందిన నల్లబోలు సుధాకర్‌రెడ్డి తనకు 58శాతం వినికిడి సమస్య ఉన్న పెన్షన్ మంజూరు చేయడం లేదని, దివ్యాంగుల పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా...డిపిఎం చేయూతకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో ఏ.పద్మశ్రీ, డిఆర్డీఓ ఎన్.సన్యాసయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అల్లుడిపై కేసు నమోదు

ప్రజాపక్షం/ పాల్వంచ : భూమి కౌలుకు ఇచ్చిన మేనత్తపై దుర్భాషలాడిన మేనల్లుడుపై పాల్వంచ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం, దుమ్ముగూడెం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన బిల్లిపల్లి రుద్రమదేవికి మండల పరిధి ప్రభాత్‌నగర్ (రెడ్డిగూడెం )లోని ఆమె పుట్టింటి వాళ్ళు పసుపు కుంకుమల కింద 3.20 కుంటల భూమిని ఇచ్చారు. అనంతరం ఆ భూమిని రుద్రమదేవి తన అన్న గట్ల పుల్లారెడ్డికి కౌలుకు ఇచ్చింది. కొంత కాలం వరకు ఇరువురి మధ్య సత్సంబంధాలు కొనసాగాయి. గత సంవత్సరంలో పుల్లారెడ్డి కొడుకు శశిధర్‌రెడ్డి ఇది మన భూమి, అత్తకు ఇచ్చేది లేదని అంటున్నాడు. ఇది తెలుసుకొన్న రుద్రమదేవి తన మేనల్లుడిని మందలించింది. అనంతరం తన భూమిని యాస సతీష్‌రెడ్డికి కౌలుకు ఇవ్వడంతో తమను కాదని వేరే వ్యక్తికి కౌలుకు ఎలా ఇచ్చిందని సాగు చేసుకొంటున్న కౌలుదారుడిని బెదిరించాడు. దీనితో విషయాన్ని రుద్రమదేవికి తెలియడంతో ఆమె ఈ నెల 23వ తేదిన రెడ్డిగూడెంకు వచ్చింది. కోపోద్రిక్తుడైన శశిధర్‌రెడ్డి తన మేనత్తతో పాటుగా భూమి కౌలుకు తీసుకొన్న వ్యక్తిని దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడగా పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఫలితం లేకపోవటంతో శనివారం రుద్రమదేవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ. సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వాలు ఎన్నికల వాగ్దానాలను నిలబెట్టుకోవాలి

- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్
- అట్టహాసంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 10వ మండల మహాసభ







**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఎన్నికల సమయంలో ప్రజలకు ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలని సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ అన్నారు. సోమవారం ఖమ్మంరూరల్ మండలంలోని పడమటితండా పంచాయతీలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(బికేఎంయు) 10వ మండల మహాసభను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళ్లచెర్వు వీరబాబు, బత్తిని సీతరాములు అధ్యక్షతన నిర్వహించిన సభలో దండి మాట్లాడారు...అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నిలుపుకోలేక పోతే ప్రజల నుండి భారీ ఎత్తున ప్రతిఘటనలు తప్పవన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, జూన్ నెల నుంచి వృద్దులకు పెన్షన్ రూ.400వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పచ్చి మతోన్మాద విధానాలతో దేశ ప్రజలను చీల్చే ప్రయత్నం చేస్తుందన్నారు. లౌకిక పార్టీలన్ని ఐక్యమై మతత్వాన్ని ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కొద్దిమందికి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ వారి ప్రయోజనలకు మాత్రమే ఉపయోగిస్తుందన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ...భూమి లేని వ్యవసాయ కూలీ మహిళలకు 12వేల రూపాయలు ఇస్తామని చెప్పి ఉపాధి హామీ పథకంలో 20రోజులు పనిచేసి ఉండాలని నిబంధన పెట్టడం సరికాదన్నారు. ఆ నిబంధనలను ఎత్తివేస్తే ఎక్కువ మంది వ్యవసాయ కూలీ మహిళలకు ఈ పథకాన్ని అందుకుంటారన్నారు.రైతు రుణమాఫీ లక్ష నుంచి రెండు లక్షలు మాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆచరణకు వచ్చేసరికి కొద్దిమందికి మాత్రమే రద్దు చేశారన్నారు. కనుక తక్షణమే మిగిలిపోయిన రైతులందరికి రుణమాఫీ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రామ్మూర్తి నాయక్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, నాయకులు పగీళ్ల వీరభద్రం, కలింగి మోహన్‌రావు, వెన్నం భాస్కర్, బానోత్ రామ్మూర్తి, ఆరెంపుల సైదులు, భూక్యా శంకర్, బొప్పి గాంధీ, కొరివి వీరన్న, మాలోత్ శంకర్, కళ్లెపు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీ విధానాలపై ఉద్యమిద్దాం

- ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల
- జులై 2న హైదరాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** భారతదేశ ప్రయోజనాలను, ప్రతిష్టను అమెరికాకు తాకట్టు పెడుతున్న ప్రధాని నరేంద్రమోడీ విధానాలపై ఉద్యమించాలని, ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధానకార్యదర్శి నానబాల రామకృష్ణ యువతకు పిలుపునిచ్చారు. సోమవారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్డుల గల డిబిఆర్ సర్కిల్లో అమెరిక భారతీయల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ప్లకార్డులతో ఆందోళన నిర్వహించారు. తొలుత అక్కడి సిపిఐ పార్టీ కార్యాలయంలో జులై2న హైదరాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ...అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వత్తాసు పలుకుతూ దేశ సార్వభౌమత్వాన్ని పత్రిష్టను నష్టపరిచే చర్యలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల భారత్‌పాకిస్తాన్ యుద్దాన్ని తానే ఆపాపని చెప్పడం చూస్తే మన దేశ ప్రతిష్టను మోడీ ఎంతలా తాకట్టు పెట్టాడనడానికి ప్రత్యేక్ష నిదర్శనమన్నారు. హౌడీ మోడీ, నమస్తే ట్రంప్ వంటి కార్యక్రమాలతను ప్రజల సొమ్ముతో చేసుకుంటూ దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. యువతకు అవసరమైన నిర్దిష్ట ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని ధ్వజమెత్తారు. ట్రంప్‌ను ప్రపంచ అధ్యక్షుడిగా చేసేందుకే మోడీ విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధనాలకు వ్యతిరేకంగా ఆమెరిక రాయబార కార్యలయ ముట్టడికి జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున్న యువజన సంఘం శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు ఉసికల రవి, జిల్లా సహాయకార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా కోషాధికారి కొల్లి రవి, 28వ డివిజన్ అధ్యక్షుడు రెబ్బగౌండ్ల గోపి, కార్యదర్శి అక్కినపల్లి దేవయ్య, 29వ డివిజన్ అధ్యక్షుడు సన్నీ, కార్యదర్శి మిరియాల నరుణ్‌తేజ్, 30వ డివిజన్ కార్యదర్శి బంక అశోక్, యువజన సంఘం సభ్యులు మామిడాల కిరణ్, గుడిమెట్ల శ్రీకాంత్, సిపిఐ నాయకులు మేళ్లచెర్వు గురవయ్య, లగిశెట్టి రమేష్, బూర్ల రాము తదితరలు పాల్గొన్నారు.

# రైతులను ఆర్ధికంగా అభివృద్ధి చేసేందుకు కృషి



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం సొసైటీ పరిధిలో రైతులు ఆర్ధికంగా అభివృద్ధి చేసేందుకు తిరుమలాయపాలెం సొసైటీ కార్యదర్శి ఏలూరి ఆనందరావు కృషి చేశారని సొసైటీ ఛైర్మన్ చావా వేణుగోపాలకృష్ణ అన్నారు. తిరమలాయపాలెం సొసైటీలో చిరు ఉద్యోగిగా 1984 సంవత్సరంలో చేరి ఎంతో మంది రైతుల మన్ననలు పొందిన ఏలూరి ఆనందరావు పదవి విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరి ఆనందరావు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని సుదీర్ఘ కాలం పాటు సొసైటీలో చిరు ఉద్యోగిగా కొనసాగుతూ సొసైటీ కార్యదర్శిగా పదవి విరమణ పొందడం ఒకపక్క ఆనందంగా ఉన్న రైతులతో తోటి ఉద్యోగులతో సన్నితంగా స్నేహభావంగా ఉన్న ఏలూరి ఆనందరావు పదవి విరమణ పొందటం బాధాకరంగా ఉందని ఆయన అన్నారు. సొసైటీ సహకార సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పేస్కేల్, ఉద్యోగ భద్రత అమలు చేస్తూ జీవో జారీ చేయడం అప్పటి నుండి సహకారం సంఘంలో తిరుమలాయపాలెం సొసైటీ పరిధిలో ఎంతో మంది రైతులు ఆర్ధికంగా ఎదిగేందుకు కృషి చేశారని, పిండిప్రోలు సొసైటీ పరిధిలో రైతులకు ఒక సంత్సరానికి రూ.1.56కోట్లు విలువ గల ఎరువులను, రూ.1కోటి పురుగుమందులను అందించిన ఘనత ఆయనకే దక్కుతందున్నారు. సొసైటీలో సుమారు 38 సంవత్సరాలు వివిధ హోదాల్లో విధులు నిర్వహించిన ఏలూరి ఆనందరావు పదవీ విరమణ పొందగా తిరుమలాయపాలెం సహకార పరపతిలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఉండేటి దానయ్యకు సొసైటీ కార్యదర్శిగా పదోన్నతిని కల్పించారు. దీంతో ఆయన సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాలేరు డివిజన్ ఆత్మ కమిటీ ఛైర్మన్ చావా శివరామకృష్ణ, మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారామరెడ్డి, సొసైటీ వైస్ ఛైర్మన్ చామకుమారి రాజు, డైరెక్టర్లు కమ్మకొమటి నాగేశ్వరరావు, ఎడ్లపల్లి నవీన్, చల్ల వెంకటేశ్వర్లు, చావా విజయలక్ష్మి, వెంకట్రావు, సొసైటీ మాజీ ఛైర్మన్ పుసులూరి పుల్లయ్య, సిపిఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ, దాసయ్య బీరోలు సొసైటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కేజిబివి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** కేజిబివి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టిఎస్‌యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రం లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేజిబివి ఉపాధ్యాయులకు మినిమం టైమ్స్ స్కేల్ ఇవ్వాలని, ఆప్షన్ హాలీడేస్ వినియోగించుకునే సౌకర్యం కల్పించాలని, సమ్మెకాలపు జీతాన్ని చెల్లించాలని మే నెల వేతనాలు చెల్లించాలని, హెల్త్ కార్డ్స్ మంజూరు చేయాలని, వ్యాయామ ఉపాధ్యాయులకు సిఆర్జిలతో పాటు వేతనం చెల్లించే విధంగా జీవో విడుదల చేయాలని, కేర్ నియమించాలని, గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సదాబాబు, మండల అధ్యక్షులు చిన్న రంగారావు, మండల కార్యదర్శి పి.నర్సింహారావు, ఎం.లవకుశ, నరేంద్ర పాల్గొన్నారు.

# ఇసుక రేవులను ప్రారంభించిన అధికారులు



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక సరఫరా చేసేందుకు మండల పరిధి లోని బ్రాహ్మణపల్లి, కలకోట, రాయన్నపేట గ్రామాల్లో ఇసుక రేవులను తహశీల్దార్ రమాదేవి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఇసుక రేవుల ద్వారా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుకను తరలించటం జరుగుతుందని, నిబంధనల మేరకు ఇసుక రవాణా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రమాదేవి, ఎపిఎం సురేంద్రబాబు, సిసిలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, ఝాన్సీ, విఓఎలు రాణి, నందిని, కరుణ తదితరులు పాల్గొన్నారు.

# కాల్వ పునరుద్దరణ




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్డు వద్ద గల ఈదుల చెరువు అలుగుకాల్వ పూడి కతీసి సోమవారం పుణరుద్ధరించారు. 100రోజుల ప్రణాలికలో భాగంగా.. కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షణ చేస్తూ జరిపించారు. ఈ సందర్భంగా కాలువలో చికెన్, చేపలు, మటన్‌షాపుల వ్యర్థాలను వేస్తున్నట్లు గుర్తించారు. తక్షణమే మున్సిపాలిటీ అధికారులను కాలువలో వేయకుండా చూడాలని ఆదేశించారు. పట్టించుకోకుండా వ్యర్థాలను పడేసినవారిపై చట్టపరంగా జరిమాన విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బానోత్ హరి, దివ్య ఉన్నారు.

# పాఠశాలను సందర్శించిన ఎంఇఓ



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలో గల ప్రాథమికోన్నత పాఠశాల సూర్యతండను మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన రిజిస్టర్లు, పాఠ్యపుస్తకాల రిజిస్టర్, నోట్ పుస్తకాల రిజిస్టర్‌లను పరిశీలించారు. అదే విధంగా విద్యార్థుల యొక్క నోట్ పుస్తకాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి కూడా పరిశీలించారు.

# కట్టా కృష్ణార్జున్‌రావుకి సన్మానం



**ప్రజాపక్షం/వైరా:** వైరా కమ్మజన సేవా సమితి కళ్యాణ మండపం అధ్యక్షునిగాఏకగ్రీవంగా ఎన్నికైనటువంటి కట్టా కృష్ణార్జున్‌రావుని సన్మానించిన వైరా ఆర్యవైశ్య ప్రముఖులు వనమా విశ్వేశ్వరరావు, డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, నూకల శ్రీనివాసరావు, మిట్టపల్లి సత్యంబాబు, కొణతాలపల్లి వెంకటసుబ్బారావు, దొడ్డా సుధాకర్,నూకల ప్రసాదరావు, గజ్జల కృష్ణమూర్తి, వజినేపల్లి చక్రధర్‌రావు, కొల్లా రాంబాబు, యంద్రపూడి శివశంకర్, మిట్టపల్లి కిరణ్‌కుమార్, కొప్పురావూరి శబరినాథ్, దారా వెంకటకృష్ణ, వెంకటసుజిత్ తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# వైరా మున్సిపాలిటీలో సాయిబాబా మాల ధరించే కార్యక్రమం ప్రారంభం

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో ఉన్న సాయిబాబా గుడి నందు సాయిబాబా మాల ధరించే కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామి వారి మాలను ధరించారు. వేసుకోవడం జరిగింది. ఈ మాల 11 రోజులు ఈ మాలతో సాయి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

## దివ్యాంగుడికి ట్రై సైకిల్ వితరణ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పుట్టుకతోనే రెండు కాళ్లు పనిచేయని దివ్యాంగుడికి ట్రైసైకిల్ వితరణగా అందజేశారు. పెనుబల్లి మండలం వియం బంజర్ లో నివశించే పంకు రమేష్ 17 సంవత్సరాలు వయస్సు వున్న దివ్యాంగుడు పుట్టుక తోనే కాళ్లు, చెవులు పనిచేయవు. తండ్రి మృతిచెందగా తన తల్లి కూలీ పనులు చేస్తూ కొడుకును పోషిస్తుంది. 5 ఏండ్ల క్రితం దివ్యాంగుడికి ట్రై సైకిల్ వితరణగా అందజేయగా ఆ సైకిల్ పై బిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. పాత ట్రై సైకిల్ పూర్తిగా పాడైపోవడంతో దానిపై తిరగటానికి ఇబ్బంది పడుతున్నాడు. అది గమనించిన బెజవాడ చంటి జోనెబోయిన చారిటబుల్ ట్రస్ట్ కి తెలపగా మండాలపాడు కి చెందిన ట్రస్టీ జోనెబోయిన అన్నపూర్ణ 10 వేల రూపాయలు విలువైన ట్రై సైకిల్ ను సోమవారం దివ్యాంగుడికి అందజేశారు.

## వాడబలిజ కులస్తులకు సర్వహక్కులు కల్పించాలి



**ప్రజాపక్షం/పినపాక:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరి పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న వాడబలిజ కులస్తులందరూ కలిసి సోమవారం రోజున మత్స్యశాఖ సంబంధిత అధికారి యం.డి ఇంతియాజ్ అహ్మద్ ఖాన్ కలిసి శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అందించేటువంటి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, ప్రతి ఒక్కరికి లైసెన్సులు రెన్యువల్ చేయాలని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నటువంటి చెరువుల్లో, కుంటల్లో వేసే చేప పిల్లల పెంపకం, చేపల వేటపై సాంప్రదాయ మత్స్యకారమైన మాకు సర్వహక్కులు కల్పించాలని కోరారు. కొన్ని వేల సంవత్సరాలుగా మా తాత ముత్తాతల నుండి జీవనం సాగిస్తూ పుట్టి పెరిగిన మమ్మల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మాకు న్యాయం జరిగేలా చూడాలని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం అధ్యక్షులు తోట ప్రశాంత్, ఉపాధ్యక్షుడు గౌర్ల మధు, ముఖ్య సలహాదారు పూజారి వెంకటేశ్వర్లు, దుమ్ముగూడెం మండల అధ్యక్షులు, వెంబడి అర్జున్ రావు, పినపాక మండల అధ్యక్షులు గగ్గూరి ఖాదర్ బాబు, గగ్గురి సాంబశివరావు, తోట వెంకటేష్, బంద సర్వేశ్వరరావు, తోట రమేష్, తోట నారాయణ, జింక బాలకృష్ణ, తోట బాలకృష్ణ, తోట వెంకన్నబాబు, జింక బొందాలు, తోట చంటి, రమేష్, తోట నరసింహా తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

### పట్టణ కార్యదర్శిగా నిమ్మటూరి





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సత్తుపల్లి పట్టణ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 9 మంది కార్యవర్గ సభ్యులు, 17 మంది కౌన్సిల్ సభ్యుల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కార్యదర్శిగా నిమ్మటూరు రామకృష్ణ, సహాయ కార్యదర్శులుగా గడ్డం నరసింహారావు, పాలకుర్తి వీరయ్యలతో పాటు, కోలేటి వెంకటేశ్వర్లు, ఖమ్మంపాడు సత్యనారాయణ, బి.అజయ్, ఎస్ కే రహ్మతుల్లా, బి సుధాకర్, రాజశేఖర్ లను కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ సత్తుపల్లి పట్టణంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్ వల్లన్న నష్టపోయిన వాళ్లకు రూ.పది లక్షల నష్టపరిహారం అందివ్వాలని, సింగరేణి కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని, సత్తుపల్లిలో నిర్మించిన వంద పడకల హాస్పిటల్ ను వెంటనే ప్రారంభించాలని, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచి, అంటు రోగాల నుండి ప్రజలను కాపాడాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించి, వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని అదే విధంగా పట్టణంలో కోతులు బారి నుండి ప్రజలను కాపాడటానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని తీర్మానాలను ఆమోదించినట్లు దండు ఆదినారాయణ తెలిపారు. ఈ సమావేశంలో సత్తుపల్లి టౌన్ కార్యదర్శి నిమ్మటూరు రామకృష్ణ, మండల కార్యదర్శి టి.యోబు, సిపిఐ టౌన్ సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సహస్ర వైద్య సేవలు భేష్..!

**-విజయవంతంగా 500 పైగా న్యూరో సర్జరీలు**
**-ప్రముఖ మెదడు, వెన్నుముక శస్త్ర చికిత్స వైద్య నిపుణులు కె మారుతిబాబు**







**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** మెదడు, వెన్నుపాము మరియు శరీరంలోని అన్ని భాగాలలోని పరిధీయ నరాలకు, గాయాలకు చికిత్సకు సంబంధించిన వైద్యపరమైనదే న్యూరో సర్జరీ. న్యూరో సర్జరీ అనేది సాంకేతికంగా అత్యంత ముఖ్యమైన శస్త్రచికిత్స ప్రత్యేకతలలో ఒకటి. దీనికి కంప్యూటర్ ఆధారిత న్యూరోనావిగేషనల్ టెక్నాలజీ, స్పైనల్ బయోమెకానిక్స్ మరియు ఇన్స్ట్రుమెంటేషన్, బ్రెయిన్ ట్యూమర్ నిర్వహణకు జన్యుచికిత్స, కాథెటర్ఆధారిత ఎండోవాస్కులర్ టెక్నిక్ తదితర నిరంతర పురోగతులు ఉన్నాయి. ఖమ్మం పట్టణంలో సహస్ర మల్టీస్పెషాలిటీ హాస్పటల్‌ను స్థాపించి పేద, మధ్య తరగతి కుటుంబాలకు మెరుగైన న్యూరో, మల్టిస్పెషాలిటీ సేవలు అందిస్తున్న ప్రముఖ న్యూరో సర్జన్ కె మారుతిబాబు ప్రత్యేక కథనం. ఆయన మాటల్లో...తరుచుగా చికిత్స పొందే పరిస్థితులలో సెరిబ్రల్ అనూరిజమ్స్, కరోటిడ్ మరియు ఇంట్రాక్రానియల్ అథెరోస్క్లెరోసిస్ మరియు స్ట్రోక్ ఉన్నాయి. అనూరిజమ్స్ మరియు స్ట్రోక్ కారణంగా కలిగే సెరిబ్రల్ హెమరేజ్‌లకు తక్షణ న్యూరో వాస్కులర్ సర్జరీ అవసరం. చికిత్సలో మెదడు నుండి రక్తాన్ని తీసివేయడం, అనూరిజం మరమ్మత్తులు ఉంటాయి. పక్షవాతం కేసుల్లో ఇషిమిక్ మరియు హేమరైజ్ వంటివి ఉంటాయి. పక్షవాతం వచ్చిన పేషంట్లను మూడు గంటల్లో ఆసుపత్రికి చేర్చగలిగితే థ్రాంబొలిసిస్ ఇంజెక్షన్ ఇచ్చే అవకాశం ఉంటుంది. దీంతో పక్షవాతం కేసులలో త్వరగా కొలుకోగలిగే అవకాశం ఉంటుంది. అనేక రకాల ఫిట్స్ కేసులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం.

### -ట్రామా, ఎమెర్జెన్సీ అధునాతన వైద్యం...

ట్రామా మరియు ఎమెర్జెన్సీలు సహస్ర మల్టీస్పెషాలిటీ హాస్పటల్ అత్యంత అధునాతమైన 24 గంటల అత్యతవసర చికిత్స కేంద్రాన్ని కలిగి ఉంది. సహస్ర మల్టీస్పెషాలిటీ హాస్పటల్‌లోని ఈఆర్ రోడ్డు ప్రమాదాలు సహా అనేక రకాల అత్యవసర ఆరోగ్య పరిస్థితులకు చికిత్స చేస్తుంది. న్యూరో సర్జరీ కీలకపాత్ర పోషిస్తున్న బహుళ విభాగాల సమన్వయంతో రోడ్డు ప్రమాదాలు, తల గాయాలు మరియు ప్రమాదవశాత్తూ పడిపోవడం వంటి కేసుల సంఖ్యను ఈఆర్ విజయవంతంగా చికిత్స చేస్తుంది. సహస్ర మల్టిస్పెషాలిటీ హాస్పటల్‌లో ఎక్కువగా తలకు గాయాలైన ఇంట్రాక్రానియల్ ప్రెజర్ మరియు నిరోధిత సెరిబ్రల్ రక్త ప్రవాహంతో బాధపడుతుండే కేసులు వస్తుంటాయి. కపాల ఒత్తిడిని తగ్గించడానికి పుర్రెలోని ఒక బాగాన్ని తొలగించే డికంప్రెసివ్ క్రానియోటమీని క్రమం తప్పకుండా నిర్వహిస్తారు. న్యూరో సర్జరీలు చేయించుకుంటున్న రోగులకు ఎండ్ టు ఎండ్ కేర్ అందించడానికి సహస్ర మల్టీస్పెషాలిటీ హాస్పటల్‌లో ఐసిపి మానిటరింగ్ సిస్టమ్‌తో కూడిన ప్రత్యేక ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను కలిగి ఉంది. శస్త్రచికిత్స తర్వాత రోగులను నైపుణ్యం కలిగిన మల్టీడిసిప్లినరీ బృందాలు నిశితంగా పర్యవేక్షిస్తాయి.

### -పేద, మధ్య తరగతి ప్రజలకు అతితక్కువకే వైద్యసేవలందిస్తున్నాం : కె మారుతిబాబు, ప్రముఖ మెదడు, వెన్నుముక శస్త్రచికిత్స వైద్యనిపుణులు



న్యూరో సేవలతో పాటు, జనరల్, డెర్మటాలజీ, గ్యాస్ట్రో, కిడ్నీ, లివర్, ఆర్థోపెడిక్, యూరాలజీ, లాప్రోస్కోపిక్ సర్జరీలు, బేరియాట్రిక్ సర్జరీలు, ఈఎంటీ తదితర వైద్య సేవలు సహస్ర మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌లో అందిస్తున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అతి తక్కువకే మెరుగైన వైద్యసేవలందిస్తున్నాం. కెవి శేషమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య క్యాంపులు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో ముమ్ముందు మరిన్ని వైద్య క్యాంపులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలల్లో ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. దీంతో మెదడులో రక్తస్రావం, ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హెల్మెట్ ధరించడం వల్ల పెద్ద ప్రమాదాల నుండి బయట పడవచ్చు. ఖమ్మం పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సహస్ర మల్టీస్పెషాలిటీ సేవలను సద్వినియోగించుకోవాలి.

## జులై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు పిలుపు**




**ప్రజాపక్షం/కల్లూరు:** 100 సంవత్సరాలగా అనేక పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వ,మోడీ నిరంకుశ విధానానికి వ్యతిరేకంగా జులై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చారు. కల్లూరు లో జరిగిన ఏఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కార్మికులకు ఈరోజు హక్కులుగా ఏ చట్టాన్ని కూడా ఏ ప్రభుత్వము దయతోను, ఇష్టంతోనో చేయలేదన్నారు. ఆ చట్టాలన్నీ కార్మికులు తమ రక్తాన్ని చిందించి పోరాడి సాధించుకున్నవని వారు గుర్తు చేశారు. అటువంటి చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తీసుకురావాల్సిన అవసరమేంటన్నారు. నిజంగా మోడీకి కార్మికుల మీద అంత ప్రేమ ఉంటే, వారి సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి ఉంటే ఉన్న కార్మిక చట్టాలను పట్టిష్టంగా అమలు చేయాలన్నారు. కానీ కార్మికుల హక్కులను కాలరాసే విధంగా చట్టాలను తొలగించి యాజమాన్యానికి అనుకూలంగా ఉండే లేబర్ కోడ్ లను తీసుకువచ్చి తన వక్ర బుద్ధి చూపించారన్నారు. 2014 19, మరియు 2019 నుండి 24 మధ్యలో మోడీ ప్రభుత్వం సంఘటిత సంఘటితంగా కార్మికుల కొరకు ఖర్చు చేసిన మొత్తం లక్ష కోట్లు కూడా లేదన్నారు. పది సంవత్సరాల కాలంలో లక్ష కోట్లు కూడా లేవంటే సంవత్సరానికి కేవలం పది వేల కోట్ల రూపాయలు మాత్రమేనన్నారు. కానీ ఇదే సందర్భంలో 10 సంవత్సరాల కాలంలో కార్పొరేట్ల శక్తులకు 16 లక్షల 53 వేల కోట్ల రుణాలను మాఫీ చేసినట్లు వారు ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి సంపద సృష్టికర్తల మీద ఎంత ప్రేమ ఉన్నదో ఈ లెక్కలే తెలియ చెబుతున్నాయన్నారు. ఎంపీల జీతాలు పెంచుకున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల కనీస వేతనం రోజుకు 70 రూపాయలకు కుదిరించడం దారుణమైన విషయమన్నారు. నరేంద్ర మోడీ చెప్తున్నట్లుగా లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే వారి జీవితం ఎట్టి పరిస్థితుల్లో బాగుపడదని, వాటి సారాంశాన్ని ఒకసారి పరిశీలిస్తే కార్మికులను ఏ విధంగా దోపిడీ చేయాలో, వారి బతుకులను రోడ్లమీదకు ఏ విధంగా తేవాలో స్పష్టంగా తెలియచెప్పున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కార్మికుల ఉపాధి కొరకు ఏర్పాటుచేసిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై కూడా మోడీ సీతకన్ను వేశాడన్నారు. నిధులు తగ్గిస్తూ, పని దినాలను తగ్గిస్తూ జీవో ఇవ్వటంతో తేడా తలం అయిపోయింది అన్నారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్ డీజిల్ గ్యాస్ ల ధరల పెరుగుదల కారణంగా రవాణా రంగంలోని కార్మికులు తీవ్ర నష్టానికి గురవుతున్నారు అన్నారు. అటు నెలవారీ కిస్తీలను కట్టలేక, వేరే పని చేసుకోలేక రవాణా రంగంలోని కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అసంఘటిత రంగమే కాకుండా సంఘటిత రంగంలోని కార్మికులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. కార్మికుల హక్కుల సాధనకై జులై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడానికి సంఘటిత అసంఘటిత రంగ కార్మికులందరూ ఏకమవ్వాలని వారు ఈ సందర్భంగా కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, జిల్లా సమితి సభ్యులు దామాల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించండి





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావాణిలోవచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చొరవచూపాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. ఐడిఓసిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఆయన హాజరై ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ప్రతీ దరఖాస్తులను పరిశీలించన ఆయన ఆయాశాఖల అధికారులకు బట్వాడా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సుదూర ప్రాంతాల నుండి వ్యయప్రయాసలకు ఓర్చి ప్రజలు ఇక్కడికి వచ్చి ఎంతో నమ్మకంతో దరఖాస్తులు సమర్పిస్తుంటారని చెప్పారు. వాటిని మాములుగా వదిలేయకుండా ప్రతిదాన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిష్కారానికి నోచుకోనివాటిపై సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

### గిరిజన దర్బారులో...

ఐటిడిఏ పరిధిలోని గ్రామాలకు చెందిన గిరిజనులు వారివారి సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఐటిడిఏలో నిర్వహించిన గిరిజన దర్బారుకు హాజరై పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వాటిని స్వీకరించిన పిఓ సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ, వర్షాలు పడుతున్నప్పటికీ గిరిజనులు వారి సమస్యల పరిష్కారం కోసం వ్యయ ప్రయాసలకు ఓర్చి ఇక్కడికి వచ్చారన్నారు. అధికారులు వారి నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా అందిన ప్రతి దరఖాస్తు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. పరిష్కరించడానికి వీలుకాని వాటిపై సహేతుకమైన నివేదికలు అందించాలన్నారు. ప్రభుత్వపథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందుతాయని, అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. ఈ గిరిజన దర్బారులో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, ఏఓ సున్నం రాంబాబు, ఆర్‌సిఓ గురుకులం అరుణకుమారితో పాటు పలుశాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ జలాలను జిల్లా రైతులకు ఇవ్వాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** సీతారామ ప్రాజెక్టు జలాలకు ఇవ్వాలని శనివారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ములకలపల్లి మండలం పూసుగూడెంలో నిర్మించిన పంప్‌హౌజ్ దగ్గర కాంగ్రెస్ పార్టీకి పిండ ప్రధాన కార్యక్రమం చేపట్టినది. దీనికి హాజరయ్యేందుకు వెళుతున్న పినపాక, కొత్తగూడెం, ఇల్లందు మాజీ ఎంఎల్‌ఏలు రేగా కాంతారావు,వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియా నాయక్‌లతో పాటుగా ఏనుగుల రాకేష్ రెడ్డి, దిండిగాల రాజేందర్, పాల్వంచ కో ఆపరేటివ్ సొసైటీ వైస్ చైర్మన్, కాంపల్లి కనకేష్, కొత్తగూడెం మున్సిపాలిటి మాజీ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, పాల్వంచ పట్టణ, మండల అధ్యక్షులు మంతపురి రాజుగౌడ్, పూసల విశ్వనాధం, కాలేరు సింధు, వనమా రాఘవేందర్ రావు తదితరులను పాల్వంచ పట్టణ పోలీసులు కుంటినాగులగూడెం వద్ద అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సంధర్భంగా నాయకులు మాట్లాడుతూ ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేక మాయమాటలతో కాలం వెల్లదీస్తుందని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ జిల్లాను సస్య శ్యామలం చేయటానికి సీతారామ ప్రాజెక్టును 18 వేయిల కోట్ల నిర్మించారని తెలిపారు. పది శాతం మిగిలిన పనులు చేయకుండానే ముఖ్యమంత్రి, మంత్రులు హడావుడిగా ప్రారంభించి కొత్తగూడెం జిల్లా రైతులకు సాగునీటిని ఇవ్వకుండా ఇతర జిల్లాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మిగిలిన పది శాతం పనులు పూర్తి చేసి సీతారామ నీటిని జిల్లా రైతాంగానికి ఇవ్వాలన్నారు. అనంతరం ఇతర జిల్లా రైతులకు ఇవ్వటానికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. లేనిచో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### గత ప్రభుత్వ హయాంలోనే...

సీతారామ ప్రాజెక్టు పూర్తి రూపకల్పన గత ప్రభుత్వ హయాంలోనే జరిగిందని కేవలం పది శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని ప్రజలు అంటున్నారు. ప్రస్తుత మాజీ ఎంఎల్‌ఏలు తమ పదవీ కాలంలో ఏం చేశారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మిగిలిన పది శాతం పనులతో జిల్లా రైతాంగానికి ఏ విధంగా సాగునీరు ఇస్తారో వారు చెప్పాలంటున్నారు. వారి పదవీ కాలంలో మౌనంగా ఉన్న నాయకులు ఇప్పుడు వారి స్వార్థ రాజకీయ కారణాలతో రైతులను రెచ్చగొడుతున్నారని మండిపడుతున్నారు.

## పోడు రైతులపై దాడులను నిలిపివేయాలి

**-పత్తి మొక్కలను ధ్వంసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి**
**- సిపిఐ నేత ముత్యాల విశ్వనాథం**



**ప్రజాపక్షం/ పాల్వంచ :** పోడు రైతులపై అటవీ అధికారుల దాడులను వెంటనే నిలిపి వేయాలని, పూత, కాత దశలో ఉన్న పత్తి మొక్కలను పీకి వేసిన అటవీ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. మండల పరిధి బంద్రుగొండలో గత వారం రోజుల నుండి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, వాచర్‌లు, గార్డులు కలిసి పేదల పోడు భూముల్లో పత్తి మొక్కలను పీకి ధ్వంసం చేయటాన్ని నిరసిస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎంతో కాలం నుండి పోడు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్న పేద రైతులపై అటవీ అధికారులు నోటి కాడికి అంది వచ్చిన బువ్వను లాగేసుకొన్న చందంగా పూత, కాత దశలో ఉన్న పత్తి మొక్కలను పీకి వేసి ధ్వంసం చేసి, దౌర్జన్యం చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.సాగు చేసుకొని జీవిస్తున్న రైతులను భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. బంద్రుగొండ గ్రామానికి చెందిన పేద రైతులైన ఇట్టి రత్నం రెండెకరాలు, కంటె నాగేంద్రబాబు మూడెకరాలు, నెల్లెల విశ్వనాథం రెండెకరాలు, మోదంపరపు సంపూర్ణ ఎకరం లో సాగు చేసిన మొత్తం ఎనమిది ఎకరాల పత్తి చేలలో మొక్కలు పీకి వేయటమే కాకుండా రైతులపై కేసులు పెడతామని బెదిరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 50 వేయిల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని, పోడు రైతులపై ఫారెస్ట్ అధికారుల దాడులను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల పోడుసాగు దారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం రేంజ్ అధికారి సురేష్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల, పట్టణ కార్యదర్శులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమిల్లి సాయిబాబ, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, వీసంశెట్టి పద్మజ, మాండల నాయకులు ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, చెన్నయ్య, ఆదినారాయణ, బొమ్మెన సత్యనారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### నష్ట పరిహారం చెల్లిస్తాం :

ఈ విషయంపై రేంజర్ సురేష్ మాట్లాడుతూ ...కంటె లక్ష్మయ్యపై ఇదివరకే కేసు నమోదు చేశామన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తామని, పీకి వేసిన పత్తి మొక్కలు పాత భూమిలో ఉన్నట్లయితే సదరు అధికారితో నష్ట పరిహారం చెల్లించేటట్లు చర్యలు తీసుకొంటామని అన్నారు.

## శేష జీవితం ప్రశాంతంగా గడపాలి : ఎస్పీ




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పదవీ విరమణ పొందిన పోలీసులు తమ శేష జీవితాన్ని సంతోషంగా హాయిగా గడపాలని ఎస్పి రోహిత్ రాజ్ అన్నారు. సోమవారం పదవీ విరమణ పొందిన పోలీసులను ఆయన తన కార్యాలయంలో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈసందర్భంగా ఎస్పి మాట్లాడుతూ 41 సం. పాటు పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రస్తుతం ఏడూళ్లబయ్యారంలో విధులు నిర్వహిస్తూ ఎస్సైగా పదివీ విరమణ పొందిన మొహమ్మద్ షఫీ, 36సం. నుండి పోలీసు ఉద్యోగంలో సేవలు అందిస్తూ భద్రాచలం ట్రాఫిక్ ఏఎస్సై సత్యనారాయణ, అశ్వాపురంలో విధులు నిర్వహిస్తూ హెడ్ కానిస్టేబుల్‌గా పదవీ విరమణ పొందిన చిన్న వెంకటేశ్వర్లు నిబద్దతతో ఇంతకాలం విధులు నిర్వహించారన్నారు. పదవీవిరమణ పొందిన అధికారులు, సిబ్బంది సంతోషంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకోవాలని సూచించారు. క్రమంగా వ్యాయామం, యోగా, ధ్యానం చేయాలని, తద్వారా మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. అనంతరం వారికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్‌పి సత్యనారాయణ, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఏఓ మంజ్యానాయక్, జిలాల్ పోలీస్ అధికారుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సైకో పాలన నడుస్తుంది..

**-ఛలో పూసుగూడెం కార్యక్రమాన్ని అడ్డుకున్న పోలీసులు**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** తెలంగాణ రాష్ట్రంలో సైకో పాలన నడుస్తుందని అశ్వారావుపేట మాజీ ఎంఎల్‌ఏ మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సీతారామ ప్రాజెక్ట్ సాగు నీళ్ళను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని ప్రాంతాలకు అందించాలనే డిమాండ్‌తో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు నేతృత్వంలో తలపెట్టిన ఛలో పూసుగూడెం కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈకార్యక్రమానికి వెళ్తున్న మాజీ ఎంఎల్‌ఏ మెచ్చా నాగేశ్వరరావును అరెస్ట్ చేసి ములకలపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 70శాతం పనులు బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే పూర్తి చేశామని, మిగిలిన పనులు కూడా పూర్తి చేయడం చేతకావడం లేదని విమర్శించారు. పూర్తి చేయడం చేతకాకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజలను గాలికి వదిలేసి దోచుకునే పనిలోనే కాంగ్రెస్ వారు ఉన్నారని ఆరోపించారు. ముగ్గురు మంత్రులు ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు అన్యాయం జరుగుతుందని, రైతుల తరుపున మాట్లాడితే అక్రమ అరెస్టులు చేస్తారా అని విమర్శించారు. బిఆర్ఎస్ పరిపాలనలో తెలంగాణ సస్యశ్యామలంగా ఉంటే కాంగ్రెస్ పరిపాలనలో పొలాలు ఎండిపోతున్నాయని అన్నారు. అరెస్టులకు భయపడే పార్టీ బిఆర్ఎస్ కాదని, ప్రజల తరుపున నిలబడుతాం, కొట్లాడుతామని అన్నారు. వెంటనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## బీజేపీ విధానాల వల్లే వ్యవస్థలు విధ్వంసం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** బీజేపీ అనుసరిస్తున్న నిరంకుశ విధానాల వల్లే చట్టభద్ద, రాజ్యాంగ బద్ద వ్యవస్థలు విధ్వంసం అవుతున్నాయని జిల్లా అకాడమిక్ సెల్ బాధ్యులు బండారు రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర శ్రీనివాస రావులు అన్నారు. సిపిఎం సత్తుపల్లి పట్టణ రూరల్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని రావి వీర వెంకయ్య భవన్‌లో సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులకు ప్రిన్సిపల్ గా సిపిఎం సత్తుపల్లి మండల కార్యదర్శి జాజిరి జ్యోతి వ్యవహరించారు. 2 రోజుల పాటు జరుగుతున్న సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథులుగా జిల్లా అకాడమిక్ సెల్ బాధ్యులు బండారు రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు హజరై మాట్లాడుతూ బీజేపీ అనుసరించిన నిరంకుశ, అప్రజాస్వామిక విధానాల వల్ల గత 11 సంవత్సరాల కాలంలో చట్టబద్ద, రాజ్యాంగ బద్ద వ్యవస్థలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని విమర్శించారు. తమ విధానాలకు మద్దతు తెలపని వారిని, నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడేవారిని ఇబ్బందులకు గురి చేస్తూ అణిచివేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, సిపిఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, కమిటీ సభ్యులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, రైతు సంఘం నాయకులు రావుల రాజబాబు, డివిజన్ కమిటీ సభ్యులు పాకలపాటి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులుగా నిర్విరామ సేవలు అభినందనీయం




**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజలకు నిర్విరామంగా సేవలు అందించిన ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జూన్ నెలలో పదవి విరమణ పొందుతున్న 22 మంది ఉద్యోగుల కోసం సన్మాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి శ్రీజ, పి శ్రీనివాసరెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులు తమ జ్ఞాపకాలను, అనుభవాలను ప్రస్తుత ఉద్యోగులతో పంచుకోవాలని కలెక్టర్ కోరారు. 30 నుండి 40 సంవత్సరాల పాటు ప్రభుత్వ రంగంలో సేవలు అందించడం చాలా గొప్ప విషయం అని, జీవితంలో ఒక ముఖ్యమైన భాగం ముగిసి, మరో అంకం ప్రారంభం అవుతుందని అన్నారు. జీవితంలో మనం చేసిన మంచి పనులు శాశ్వతంగా నిలిచి పోతాయని అన్నారు. ప్రజలకు వివిధ ప్రభుత్వ శాఖలలో దశాబ్దాల పాటు సేవలు అందించిన ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు భగవంతుని అశీస్సులు ఉండాలని, మిగిలిన జీవితం ఆరోగ్యంతో, ఆనందంతో, ప్రశాంతంగా గడవాలని కోరుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. దశాబ్దాల కాలంగా ప్రజలకు సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో ఏ పద్మశ్రీ, డిఆర్డీ ఎన్ సన్యాసయ్య, చింతకాని తహసీల్దార్ కె అనంతరాజు, డిప్యూటీ తహసీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, జిల్లా అధికారులు, పదవి విరమణ పొందుతున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులు, వివిధ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సక్రమంగా అండర్ డ్రైనేజి పనులు నిర్వహించాలని బిఆర్ఎస్ వినతి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీ పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు అస్తవ్యవస్తంగా నిర్వహిస్తున్నారని, సక్రమంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని బిఆర్ఎస్ నాయకులు కోరారు. సోమవారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో వినతి పత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ మధిర మున్సిపాల్టీలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు వార్డుల వారీగా క్రమ పద్దతిలో కాకుండా ఇష్టానాసారంగా సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిర్వహిస్తున్నారని, ఆయా వార్డుల్లో సిసి రోడ్లు తవ్వి రోజుల తరబడి గుంతలు పూడ్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీని వలన ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్కూళ్లకు వెళ్లే పిల్లలు బస్సులు రాకపోకలు తీవ్ర అంతరాయం కలుగుతుందని, పిల్లలు, ప్రజలు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వార్డుల్లో కొన్నిచోట్ల పైపులు వేసి చాంబర్ల వద్ద పని పూర్తి చేయకుండానే అలాగే వదిలి వేరే ప్రాంతంలో పనులు చేపడుతున్నారని, దీని వలన వాహనాల రాకపోకలకు వీలులేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క స్పందించి వార్డుల వారీగా ప్రారంభించిన పనులు పూర్తి చేసిన తర్వాత వేరే వార్డుల్లో పనులు ప్రారంభించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బిఆర్ఎస్ విమర్శలు



**ప్రజాపక్షం/ మధిర :** అభివృద్ధి ప్రదాత, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బిఆర్ఎస్ పార్టీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధిర పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజి వ్యవస్థను మెరుగుపర్చేందుకు దేశవిదేశాల్లో నిర్మిస్తున్న ప్రెషర్, వ్యాక్యూమ్ టెక్నాలజీని రూ.130కోట్లతో ఏర్పాటు చేస్తున్నారని, రోడ్డు మధ్యలో నూతన టెక్నాలజీ ద్వారా పైప్‌లైన్ సైజ్ వరకు కట్ చేసి పైప్ వేసిన తర్వాత పూడ్చి వేయడం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధి పనులు జరగుతున్న సమయంలో వర్షాకాలం కావటంతో కొన్ని చోట్ల ప్రజలు కొద్ది ఇబ్బంది కలగటం వాస్తమేనన్నారు. ఈ సాకుతోఅభివృద్ధిని అడ్డుకోవాలని ప్రతిపక్షాలు కుట్ర పన్ని అండర్ డ్రైనేజి వ్యవస్థ పనులపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా రోడ్డు మొత్తం ఒకేసారి తవ్వకుండా విడతలవారీగా పనులు చేయాలని అధికారులను ఆదేశించటం జరిగిందని తెలిపారు. ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు మధిర పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ అయిలూరి సత్యానారాయరెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షులు దుంప వెంకటేశ్వరరెడ్డి, చిలువేరు బుచ్చిరామయ్య, కర్నాటి రామారావు, పత్తపురపు సంగయ్య, నిడమనూరు వంశీకృష్ణ, తుమ్మల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# వైవిని ఆదర్శంగా తీసుకోవాలి




**- రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ కె. లింగయ్య**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** విద్యారంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు వైవిని ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ కె.లింగయ్య అన్నారు. సోమవారం ఖమ్మంనగరంలోని ఎన్ఎస్‌సి కాలనీలో స్కూల్లో పిఆర్టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ వేడుకను నిర్వహించారు. దీనికి కె. లింగయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యి ప్రసంగించారు. వైవి నాకు చిరకాల మిత్రుడని ఉత్తమ ఉపాధ్యాయుడిగా, సమాజ సేవకుడిగా పేరొందరని కొనియాడారు. జిల్లాలోని అనేక పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు,వాటర్ ప్యూరిఫైర్లు అందిచడంలో విశేష కృషి చేశారని తెలిపారు. కరోనా బారిన పడిన వారి కోసం ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహించి, ఆక్సిజన్ కాన్సన్ట్రేర్లు అందజేసి సమాజ సేవలో ముందున్నారని అన్నారు. మిగిలిన జీవితం సమాజ సేవలో ముందుండాలని పాఠశాలలకు ఎప్పుడు తన వంతు సహాయంగా ముందు వరుసలో ఉండాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యానారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, కార్పొరేటర్ పైడిపల్లి సత్యనారాయణ, పూనాటి వెంకటేశ్వర్లు, రాము, రామారావు, నారాయణరావు, యుటిఎఫ్ జిల్లా బాధ్యులు పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా మాజీ అధ్యక్షులు ఎం మధు, కెవిఎస్ చలపతిరావు, వేగినాటి లక్ష్మయ్య, జిల్లా కార్యదర్శి సోమ్లు నాయక్, ఉపాధ్యాయులు, బంధువులు, మిత్రులు, విద్యార్థులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా పిట్టలవారిగూడెం రోడ్డు

**- అధికారులు పట్టించుకోకుంటే ఆందోళన చేస్తాం : సిపిఐ**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం గూడూరుపాడుపంచాయతీపరిధిలోని పిట్టలవారిగూడెం రోడ్డు ప్రమాదరంగా దర్శనమిస్తుంది. గతంలో మున్నేటి విపత్తుతో కోతకు గురైన రహదారి తాజాగా కురుస్తున్న వర్షాలతో మరింత భయానకంగా తయారయ్యింది. ఈ ఊరిలో మొత్తం 100కుటుంబాలు ఉన్నాయి.అందులో ఎక్కువ మంది కార్మికులు ఉండటంతో నిత్యం పనుల కోసం ముప్పావు శాతం మంది ఖమ్మం వస్తుంటారు. పట్టపగలే ప్రమాదకరంగా ఉన్న రోడ్డు వాహనదారులకు కనిపించే పరిస్తితి లేదు. ఇక వెలుగులు లేని చిమ్మ చీకట్లోనైతే పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నెలలతరబడి ఇంతటి భయానక పరిస్థితి ఉన్నప్పటికి అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. దీనిపై సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ మాట్లాడుతూ.. మరమ్మత్తులు తక్షణమే చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.లేని పక్షంలో సిపిఐ తరుపున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

# జూలై 5న రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్ మధిర రాక




**ప్రజాపక్షం/ మధిర :** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్( ఐఎఎల్) ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జూలై 5వ తేదీన మధిరలో నిర్వహించనున్న న్యాయవాద అవగాహన తరగతులకు హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ బి.చంద్రకుమార్ హాజరు కానున్నారని సీనియర్ న్యాయవాది వాసిరెడ్డి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం మధిరలో జరిగిన న్యాయవాదుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం న్యాయవ్యవస్థలో వచ్చిన మార్పులపై న్యాయవాదలకు అవగాహన కలిగించాలనే ఉద్ధేశ్యంతో ఈ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. న్యాయవాదిగా ఎంతో అనుభవం కలిగి అనంతరం న్యాయమూర్తిగా ఎంపికై విశేష సేవలు అందించిన రిటైర్డ్ జస్టిస్ బి.చంద్రకుమార్ ఆర్ట్ ఆఫ్ క్రాస్ ఎగ్జామినేషన్ ఇన్ క్రిమినల్ కేసెస్ తో పాటు ప్రొఫెసనల్ ఎథిక్స్ అండ్ న్యూ క్రిమినల్ మేజర్ యాక్ట్స్ అను అంశాలపై వివరణాత్మకంగా బోధించనున్నట్లు తెలిపారు. మొదటిసారిగా మధిర ప్రాంతంలో నిర్వహిస్తున్న అత్యంత విలువైన ఈ తరగుతులను మధిర పరిసర ప్రాంత న్యాయవాద సోదర సోదరీమణులు వినియోగించుకోవాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఎఎల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుల్లారావు, ప్రధాన కార్యదర్శి జె.రమేష్, ఐఎఎల్ జిల్లా ఉపాధ్యక్షులు కావూరి రమేష్, తేలపోలు వెంకట్రావు, ప్రచార కార్యదర్శి జివి లక్ష్మీ నారాయణ, కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు పాల్గొన్నారు.

# సబ్ జైలు నిర్మాణం వేరే ప్రదేశానికి మార్చాలని వినతి




**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** ఆత్కూరు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 163లో భూమిని సబ్ జైల్ నిర్మాణానికి ఇవ్వడానికి వ్యతిరేకిస్తూ గ్రామ మాజీ సర్పంచ్ అబ్బూరి సంధ్యా రాణి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డే లో తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయాంలో గ్రామంలోని నిరుపేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేని వారికి అప్పటి తహశీల్దార్ సర్వే నెంబర్ 163లో భూమిని సర్వే చేయటం జరిగిందని, అప్పటి ఎన్నికల కోడ్ రాగానే ఆ ప్రక్రియ ఆగిపోయిందన్నారు. గ్రామంలోని నిరుపేదలను గుర్తించి వారికి ఇండ్ల పట్టాలు కేటాయించాలని, సబ్ జైల్ నిర్మాణాన్ని వేరే చోటికి మార్చాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, అసలైన లబ్ధిదారులు కాకుండా పొలాలు, ఇండ్లు ఉన్న వారిని ఎంపిక చేసి నిజమైన నిరుపేదలకు అన్యాయం చేశారని అన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిమ్మ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీ ఒకే తాను గుడ్డలు




**ప్రజాపక్షం/చింతకాని :** కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రెండూ ఒకే తాను గుడ్డలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం చింతకాని లో జరుగుతున్న పార్టీ శిక్షణా తరగతుల్లో పొన్నం మాట్లాడుతూ కేంద్రంలో మోడీ తీసుకువచ్చిన నల్లచట్టాలతో అటు రైతులు , ఇటు శ్రామికులు తీవ్ర నష్టపోతున్నారన్నారు. కార్పొరేట్లకు దోచి పెడుతూ పేదల పై పన్నుల భారం మోపుతన్నారన్నారు. మోడీ చెప్పిన అచ్చేదిన్ అదానీ, అంబానీలకు మాత్రమేనని సామన్యులకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీనీ అమలు చేయడంలేదన్నారు.రైతు రుణమాఫీ, లో పూర్తిగా విఫలమైందన్నారు. కేవలం మహిళలకు ఉచిత బస్సు తప్ప అంతా తుస్సేనన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై త్వరలోనే ప్రజా ఉద్యమాలు చేపడాతామన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో చింతకాని మండలంలో ఎర్ర జెండా ఎగరడ ఖాయమన్నారు. ఈసమావేశంలో పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండలకార్యదర్శి రాచబంటి రాము, మండలకమిటీ సభ్యులు వత్సవాయి జానకిరాములు, తోటకూరి వెంకటనర్సయ్య, పులి యజ్ఞనారాయణ, దేశబోయిన ఉపేందర్, షేక్ మౌలానా, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ఆర్అండ్ఆర్ ప్యాకేజిలో అన్యాయం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సీతారామ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ లో మోసం జరిగినట్లు భూ నిర్వాసితురాలు ఎస్.కె మున్నిషా ఆరోపించారు. మండల పరిదిలోని యాతాలకుంట గ్రామానికి చెందిన ఎస్.కె మున్నిషా సోమవారం తన ఇద్దరు పిల్లలతో తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తన అత్త, కొడుకులపేరుతో వచ్చిన చెక్కును రద్దు చేసి, తన కొడుకు పేరుతో చెక్కు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మున్నిషా మాట్లాడుతూ తన భర్త అనారోగ్యంతో మృతి చెందాడని, ఆయన మృతి అనంతరం మంజూరైన సీతారామ భూ పరిహారం రూ.8 లక్షలు మొత్తాన్ని తన అత్త ఎస్.కె బియాం పేరుతోమంజూరైందని, మిగిలిన భూ పరిహారం కూడా ఈ మద్యన ప్రభుత్వం మంజూరు చేసిందని, నా ఇద్దరు పిల్లలతో తాను ఇబ్బందులు పడుతున్నానని, భర్త అనంతరం తనను సహజ సంరక్షురాలిగా చూడాల్సిన అధికారులు అలా చేయకుండా కొందరు రాజకీయ నాయకుల ఒత్తిడితో నష్ట పరిహారాన్ని తన అత్త బియాం, తన కొడుకు ఎస్.కె బాబు రషీద్ పేరుతో మంజూరు చేశారని, గతంలో తన భర్త అకౌంట్ లో ఉన్న రూ.4 లక్షలు తనకి తెలియకుండా తన అత్త బియాం, గ్రామంలోని కొందరి సహాయంతో కాజేసిందని, ఇప్పుడు ఈ నష్టపరిహారాన్ని కూడా కాజేయాలని



చూస్తుందని, తన కొడుకు పేరుతో ఉన్న భూమికి నాయనమ్మ అయిన నా అత్త ఎలా సంరక్షకురాలిగా ఉంటుందని, తల్లిని నేను ఉండగానే నష్టపరిహారం కోసం కొందరితో చేతులు కలిపి తనకు, తనబిడ్డలకు అన్యాయం చేయాలని చూస్తుందని కావునా తక్షణమే మంజూరైన చెక్కును రద్దు చేసి, తన కొడకు బాబు రషీద్ పేరుపై జాయింట్ చెక్కును మంజూరు చేసి, పిల్లలకు రక్షణగా నిలవాలని అధికారులకు వినతి పత్రం అందజేశారు.

# ఆదివాసీ మహిళలు చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆదివాసీ గిరిజన మహిళలు ఇంటిపట్టున ఖాళీగా ఉండకుండా చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పి ఆర్థికంగా నిలదొక్కుకుని పది మందికి ఉపాధి కల్పించాలని ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు అన్నారు. సోమవారం ఐటిడిఏ లోని గిరిజన దర్బారుకు హాజరై గిరిజనుల సమస్యలపై ప్రాజెక్టు అధికారి బి రాహుల్‌తో చర్చించిన అనంతరం చిన్న తరహా



పరిశ్రమల ద్వారా న్యూట్రీషియన్ ఫుడ్ అమ్మకాలు జరిపే స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ఆదివాసీ మహిళలు వారి సొంతగా తయారు చేసిన ఆరు రకాల సబ్బులు, షాంపులు, మిల్లెట్ బిస్కెట్లు, ఇప్పపువ్వు లడ్డు, ఇతర పచ్చళ్లను ఐటిడిఏ కార్యాలయానికి వచ్చే వారికి సరసమైన ధరలకు విక్రయించాలన్నారు. గిరిజన మహిళలకు ఉపాధి కల్పించేందుకు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ప్రతీ ఒక్కరూ కొనుగోలు చేసి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ మహిళలు విజయలక్ష్మీ, సమ్మక్క, సున్నం ఈశ్వరి, స్వాతి, బేబి, రాణి, జగ్గా కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఓఎఫ్ఆర్ హక్కులు ఎవరికో తేల్చాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆర్ఓఎఫ్ఆర్ హక్కులు గిరిజనులకా, గిరిజనేతరులకు చెందుతాయా అనేది ఐటిడిఏ పిఓ తేల్చాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఐటిడిఏ పిఓకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం పాయం మాట్లాడుతూ చర్ల మండలం కుదునూరు పంచాయితీ పరిధిలోని పోడు భూముల సమస్య గిరిజనేతరులతో తలెత్తుతోందని, ఈ సమస్యకు పిఓ పరిష్కారం చూపాలన్నారు. తాలిపేరు కెనాల్ ప్రక్కన గల పోడుభూములు నరికిన సందర్భంగా 1993 సం.లో దేవరపల్లి ఆదివాసీలైన 14 మందిపై అటవీ అధికారులు కేసులు పెట్టి జైలుకు పంచారన్నారు. ఆ భూములను 2008లో కుదునూరు గ్రామానికి చెందిన పవన్ అనే గిరిజనేతరుడు ఆ భూముల విషయంలో జోక్యం చేసుకుని గొడవలు సృష్టిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడని అన్నారు. 2018 సం.లో అదే గ్రామానికి చెందిన బుటారి రాఘవయ్య అనే వ్యక్తిని అతి కిరాతకంగా హత్య చేసిన వలస గిరిజనేతరులు మళ్లీ ఆ పోడు భూముల విషయంలో ఆదివాసీలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో ఐటిడిఏ అధికారులు చొరవ చూపి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరా రు. ఈ కార్యక్రమంలో కారం సాయమ్మ, కారం శాంతి, తెల్లం సరోజ, కారం సుధా, కారం లక్ష్మీ తదితరులున్నారు.



# విద్యతోనే జీవితాల్లో వెలుగులు

**ప్రజాపక్షం/కామేపల్లి:** విద్యతోనే జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఎంఈవో వెంకట్ అన్నారు. తాళ్లగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో యరగడ్ల బాబు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నాగరాజు, కుమార్తె సత్యవతిలు పాఠశాల విద్యార్థులకు రాత పుస్తకాలు, బ్యాగులు, ఇతర అవసరమైన సామాగ్రిని వితరణగా అందజేశారు. యరగడ్ల బాబు విద్యా జ్యోతి కార్యక్రమాన్ని సోమవారం



ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈవో వెంకట్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రయోజనార్థం సామాగ్రిని వితరణగా అందజేయడం గొప్ప విషయమని అన్నారు. దీంతో పాటు కామేపల్లి ఉన్నత పాఠశాలలో కూడా పదో తరగతి వార్షిక ఫలితాలలో ప్రథమ 10వేలు, ద్వితీయ 6వేలు స్థానాలలో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందజేస్తామన్నారు. విద్యా జ్యోతి కార్యక్రమం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని దాతలు నాగరాజు, సత్యవతిలు తెలిపారు. తాళ్ళగూడెం పాఠశాల హెచ్ఎం నరసింహారావు టై బెల్టులు, ఉపాధ్యాయురాలు విజయ బ్యాగులను, ఉపాధ్యాయురాలు పుష్ప ప్లేటులను వితరణగా అందజేశారు. ఈకార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం శైలు, తాళ్ళగూడెం హెచ్ఎం ధరావత్ నరసింహారావు, ఉపాధ్యాయులు పుష్ప, విజయ, కిషన్ నాయక్, గ్రామస్తులు కోటయ్య, వెంకట నరసయ్య, నాగేశ్వరరావు, రమేష్, కృష్ణ, విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె**

**ప్రజాపక్షం/మణుగూరు:** మున్సిపాలిటీ పరిధిలో సైడ్ డ్రైనేజ్ కబ్జా, ప్రహరీ గోడల నిర్మాణాలతో సమస్యలు ఏర్పడుతున్నాయని, మరోవైపు వర్షాకాలంతో ముంపు సమస్యలు పొంచి ఉన్నాయని తక్షణమే అధికారుల చర్యలు చేపట్టి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలంటూ సోమవారం కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు, సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలాజీ నగర్ లో తక్కువ స్థలంలో ఆకాశాన్నంటే రీతిలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, తద్వారా ట్రాఫిక్, తాగునీటి, డ్రైనేజీ సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. వెంటనే సదరు నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలంటూ కోరారు. కాలనీలో కొందరు ఇంటి యజమానులు సైడ్ డ్రైనేజ్ పై అక్రమంగా ప్రహరీ గోడలు నిర్మించడం డ్రైనేజీలో నీరు పోక కాలనీలో ముంపు సమస్యలు ఏర్పడుతున్నాయని, పేర్కొన్నారు. గతంలో 2022 వరదల సమయంలో డ్రైనేజీ కబ్జాల వల్ల మా ఇళ్లు మునిగిపోవడాన్ని గుర్తించిన అప్పటి ఎమ్మెల్యే సైడ్ వాల్ కూల్చివేయించారని, 2024 ఆగస్టు 31న



వర్షం కురిసినప్పుడు 256 ఇళ్లు మళ్ళీ మునిగిపోయాయన్నారు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.16,500 నష్టపరిహారం అందించిందన్నారు. మళ్ళీ కొంత మంది కొత్త ఇంటి యజమానులు డ్రైనేజ్ పై భాగాన్ని కబ్జా చేసి ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారని, ఫలితంగా డ్రైనేజీ లో చెత్త తొలగించడానికి మార్గం లేకుండా పోయిందన్నా రు. అలాగే వీరిలో చాలామంది ఇంట్లో వాడిన మురికి నీళ్లను రోడ్డుపైకి వదులుతున్నారని, దీని వల్ల రోడ్లు బురదగా మారి పాదచారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందన్నారు. ఈ సమస్యపై గతంలో తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ గా ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, అక్రమ నిర్మాణాలను, అడ్డుకోవాలని, ప్రజలను ముంపు నుండి కాపాడాలని ఆయన కోరారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. సోమవారం గ్రామ పంచాయితీల పరిధిలో సుమారు 35లక్షల అంచనా వ్యయంతో కూడిన పలు సీసీ రోడ్లు, అభివృద్ధి ప్రారంభోత్సవాలను చేశా రు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, సొసైటీ ఛైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ, ఐఎన్‌టియూసి అనుబంధ సంఘాల ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.



# ఏకగ్రీవంగా సిపిఐ మండల కార్యదర్శుల ఎన్నిక

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని మూఠపురం గ్రామంలో ఆదివారం జరిగిన నేలకొండపల్లి మండల 17వ మహాసభ లో సిపిఐ మండల కార్యదర్శి గా నేలకొండపల్లి కేంద్రకు చెందిన మారిశెట్టి వేంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా భైరవునిపల్లి గ్రామానికి మల్లెబోయిన ఉపేందర్, కోత్తకోతురు గ్రామానికి చెందిన మాల్లోతు అయోధ్యలతో ఏడుగురు కార్యవర్గ సభ్యులు, 23 మంది కౌన్సిల్ సభ్యులు గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు మాట్లాడుతూ, నాయకులు ప్రజల సహకారంతో భారత కమ్యూనిస్ట్ పార్టీని బలోపేతం చేస్తాం అని అన్నారు. రాబోయే కాలంలో మండలంలో సీపిఐ నీ ఉన్నతమైన స్థానంలో నడిపించేందుకు ప్రయత్నం చేస్తామని అన్నారు. నాయకులు, మండల కమిటీ సభ్యుల సహాయ సహకారంతో ముందుకు కొనసాగిస్తానని వెల్లడించారు. పార్టీ ప్రతిష్ట కోసం శ్రమిస్తామని చెప్పారు. మండల కార్యదర్శిగా ఎన్నికా చేసిన నాయకులకు కృతజ్ఞత ధన్యవాదాలు తెలియజేశారు.



# వైరా ఐఎంఎల్ డిపో ఇంచార్జి మేనేజర్‌గా రమేష్

**ప్రజాపక్షం/వైరా:** వైరా ఐఎంఎల్ డిపో ఇంచార్జి మేనేజర్‌గా ఏ రమేష్‌ను నియమించారు. గత రెండు రోజుల క్రితం తెలంగాణ బేవరేజేషన్ ఎండి హహరి కిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు సంవత్సరాలుగా ఈ డిపో ఇంచార్జి మేనేజర్‌గా పనిచేస్తున్న నారాయణరావు సోమవారంతో పదవీవిరమణ పొందారు. ఆయన స్థానంలో హన్మకొండ వన్ ఐఎంఎల్ డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న రమేష్‌ను వైరాకు బదిలీ చేశారు. 2016 నుండి 2018 వరకు రమేష్ వైరా ఐఎంఎల్ డిపోలో ఏవోగా విధులు నిర్వహించారు. 2015 నుంచి ఇప్పటివరకు అనేక హోదాల్లో వైరా డిపోలో పనిచేసిన నారాయణరావు సమర్ధవంతంగా తన విధులను నిర్వహించారు.

# పెద్దమ్మతల్లి గుడిలో టెండర్, బహిరంగ వేలం

**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి కేశవాపురం, జగన్నాధపురం గ్రామాల మద్యన కొలువై ఉన్న ( శ్రీకనకదుర్గ ) పెద్దమ్మతల్లి దేవాలయంలో జూలై 2వ, తేదీ బుదవారం రోజున దయం 11 నుండి టెండర్ కం బహిరంగ వేలం పాటలు ఉన్నాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్. రజనీ కుమారి, పాలక మండలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానానికి చెందిన రెండు ఏసి ఫంక్షన్ హాల్స్ లీజు హక్కుల కోసం ఆన్‌లైన్‌లో http:tender.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా లేదా దేవస్థాన కార్యాలయంలో 02.07.2025 వరకు రూ. 2000/లు చెల్లించి టెండర్ ధాఖలు చేసుకోవచ్చన్నారు.కొత్త కాంప్లెక్స్, పాత కాంప్లెక్స్ లలో గల షాపులు, తల నీలాలు, భక్తులు అమ్మవారికి చెల్లించిన చీరలను పోగు చేసుకోవటానికి, పూలు, పూల దండలు విక్రయించుకొనేందుకు, ఫోటోలు తీసుకొనేందుకు హక్కు లీజులు, లైసెన్స్ హక్కులు పొందటానికి, దేవస్థానం తరుపున పోగు చేసిన చీరల అమ్మకానికి, పాత షాపు నెంబర్ ఒకటిలో బల్లలు, బొమ్మలు, ఇతర వస్తువుల అమ్మకానికి మరియు శివాలయంలో కొబ్బరి చిప్పలు పోగు చేసుకోవటానికి లైసెన్స్ హక్కు పొందినప్పటి నుండి 19.10.2025 వరకు కాల పరిమితికి గాను సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలములను నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఆలయంలో ప్రతీ రోజు లడ్డు, పులిహోర ఇతర ప్రసాదాలను తయారు, ప్యాకింగ్ చేయుట కోసం ఆసక్తి కలిగిన బ్రాహ్మణుల అవసరం ఉందని కావునా ఆసక్తి కలిగిన వారు జూలై రెండవ తేదిన దేవస్థాన కార్యాలయంలో 200/లు చెల్లించి షెడ్యూల్ పొంది నిభందనల మేరకు ధరావత్తు డిడి చెల్లించి జతపరిచి టెండర్ వేసి బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

# పలకలు, ట్యాబ్లు పంపిణీ

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పీయంఆర్ ట్రస్టు నుంచి మండల విద్యా వనరుల కేంద్రంలో పని చేస్తున్న సీఆర్పీ, సిబ్బంది లకు సోమవారం ట్యాబ్లను పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ యం.యర్రయ్యల చేతుల మీదుగా ఏడుగురు కు ట్యాబ్లను అందించారు. అదే విధంగా మండలం లోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు, సీఆర్పీలు, సిబ్బంది, పీయంఆర్ ట్రస్టు నిర్వహాకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల తనిఖీ



**-విధుర బ్లడ్ బ్యాంకుపై చర్యలు : డిఎంహెచ్ఓ కళావతిబాయి**

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** ఖమ్మం అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఆదేశానుసారం ఖమ్మంలో గల అన్ని ప్రవేట్ బ్లడ్ బ్యాంకులను వైద్య ఆరోగ్య శాఖ మరియు డ్రగ్ ఇన్స్పెక్టర్ సంయుక్త తనిఖీలలో బాగంగా సోమవారం తనిఖీలను జరిపారు. ముందుగా నోవా కేర్ బ్లడ్ బ్యాంకును తనిఖీలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి కళావతిబాయి, అసిస్టెంట్ డైరక్టర్ డ్రగ్ కంట్రోల్ అరవింద్, జిల్లా అభివృద్ధి కారి కె రాంగోపాల్‌రెడ్డి , ఖమ్మం జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, కొత్తగూడెం జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విని ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అన్ని అనుమతులు చెక్‌చేసి, నిర్వహణ రిజిస్టర్లను, నిర్వహణ సిబ్బంది వివరాలను, బ్లడ్ తీసే విధానం, దానిని నిలువ చేసే విధానాలను పరిశీలించారు. తలసేమియా రోగులకు అందిస్తున్న బ్లడ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన నిర్వహణ కొరకు తగిన సూచనలు చేశారు. నిబంధనలకు అనుగుణంగా బ్లడ్ బ్యాంకు పనిచేయాలని ఆదేశించారు. తదనంతరం విధుర బ్లడ్ బ్యాంకు తనిఖీలు చేసి బ్లడ్ నిలువలు వేరే చోట నిల్వ చేయడాన్ని గమనించి, ఆ గదిని పూర్తి స్థాయిలో పరిశీలించి అట్టి నిలువలను డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ఆధ్వర్యంలో లెక్కించి దానిపై తగు కఠిన చర్యలు చేపట్టి ఆ సాంపిల్స్‌ను ఐపిఎం ల్యాబ్‌కు పంపి వాటి స్థితి గతులను పరీక్షలు జరిపి తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. తదనంతరం బ్లడ్ బ్యాంకును పూర్తి స్థాయిలో పరిశీలించి , నియమ నిబంధనలు పాటిస్తూ రోగులకు సరైన బ్లడ్‌ను అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సైదులు, బ్లడ్ బ్యాంకు ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డెమో జి సాంబశివరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మానవశరీరంలో పళ్లకు చాలా ప్రాముఖ్యిత



**-ఎన్ఎస్‌రావు మల్టీస్పెషాలిటీ దంత వైద్యశాల సేవలు అభినందనీయం**
**-నేడు వరల్డ్ డాక్టర్స్ డే**

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** పళ్ళు మానవ శరీరంలో ముఖ్యమైన భాగం. ఇవి ఆహారాన్ని నమలడానికి, మాట్లాడానికి మరియు ముఖ ఆకృతిని కాపాడుకోవడానికి సహాయపడతాయి. దంతాలు ఆరోగ్యంగా ఉండటం ముఖ్యం. ఎందుకంటే దంత సమస్యలు ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. దంతాలు ఆరోగ్యంగా లేకపోతే, ఉదాహరణకు చిగుళ్ల వ్యాధి ఇతర వ్యాధులు ప్రమాదకరంగా ఉంటాయి. అలాగే ఆరోగ్యమైన పళ్లు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. నోటి ఆరోగ్యం బాగుంటేనే వంటి ఆరోగ్యం బాగుటుంది. గుండె జబ్బులు దరిచేరవు. అందుకే నోటి ఆరోగ్యం పదిలంగా కాపాడుకోవడం అందరికీ ఎంతో అవసరం. నోటి లోని దంతాలు, చిగుళ్ల సంరక్షణ కోసం మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు విషయంలో మనకు అవగాహన ఉండాలి. మన ఖమ్మంలో ఎన్ఎస్‌రావు డెంటల్ స్పెషాలిటీ దంత వైద్యశాలను ప్రముఖ దంత వైద్యులు జంగా నిఖిల్ కుమార్, నోటిలో పుండ్లు, మచ్చలు, కాన్సర్ నిర్ధారణ వైద్య నిపుణులు డాక్టర్ నల్లమల్ల శిల్పలు నెలకొల్పి పట్టణ, పరిసర ప్రాంతాలకు ప్రజలకు మెరుగైన దంత సేవలందిస్తున్నారు. నేటి వరల్డ్ డాక్టర్స్‌డే సందర్భంగా ప్రజాపక్షం ప్రత్యేక కథనం.

ఎన్ఎస్‌రావు మల్టిస్పెషాలిటీ దంత వైద్యశాలను 2021 సంవత్సరంలో నెలకొల్పి నాటి నుండి నేటివరకు అనేక రకాల దంత సమస్యలకు మెరుగైన వైద్యసేవలందిస్తున్నారు. పుట్టుకతోనే నాటల్ టీత్ వచ్చిన ఓ పసికందుకు పిల్లల వైద్యుల నిపుణుల సూచన మేరకు రెండు దంతాలు తొలగించారు. ఇటువంటివి మూడు వేల పిల్లలలో ఒకరి వస్తుంటాయి. నాటల్ టిత్ తొలగించకపోతే విరిగిపోయి మింగే అవకాశం ఉంటుంది. ఇటువంటి సర్జరీలు ఎన్ఎస్‌రావు మల్టీస్పెషాలిటీ నిర్వహించారు. 25 ఏళ్ల యువతికి నోటిలో కనిపించకుండా ఉన్న పంటిని పరీక్షలు నిర్వహించడంతో దవడ కుడి వైపున జ్ఞాన దంతంకి సంబంధించిన తిత్తిని కనుగొన్నారు. ఆ తిత్తిని పరీక్షకు పంపగా ఇది డేంజరస్ సిస్ట్‌గా తేలింది. అనంతరం సర్జరీ ద్వారా తొలగించారు. ఇది తేలికపాటి అయినప్పటికీ చికిత్స చేయించకుండా వదిలిస్తే ప్రాణానికి ముప్పు సంబవించేది. ఇటువంటి వినూత్న సర్జరీలను నిర్వహించడం గొప్ప విషయం. దీంతో అన్ని దంత, నోటిలోపుండ్లు, మచ్చలు, కాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వేలాది మందికి మెరుగైన వైద్యసేవలందిస్తున్నారు ఈ దంపతులు.

**-ప్రతి ఒక్కరూ పళ్ళపై అవగాహన కలిగి ఉండాలి**
**జంగా నిఖిల్, దంత, రూట్ కెనాల్ వైద్య నిపుణులు**



పిప్పి పళ్లు ఉండి, పంటి నొప్పి లేకుండా ఉంటే డాక్టర్ దగ్గరకు వెళ్లవలసిన అవసరం లేదనే అపోహ చాలామందిలో ఉంది. పంటి నొప్పి వచ్చేంత వరకు నిరిక్షించడం సరి కాదు. ఎందుకంటే పంటి నొప్పి అన్నది పంటి లోపల ఉండే మూలం దెబ్బతిన్నడం వల్ల వస్తుంది. అప్పుడు సాధారణ ఫిల్లింగ్ బదులు రూట్ కెనాల్ చికిత్స వంటివి అవసరమవుతాయి. అదే కనుక నొప్పిలేని దశలోనే డాక్టర్‌కు చూపిస్తే శ్రమ, ఖర్చు రెండూ తగ్గుతాయి. విటమిన్ సి, క్యాల్షియం ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. రోజుకు రెండుస్లారు తప్పనిసరిగా బ్రష్ చేసుకోవడం అలవాటు చేసుకోవాలి.

**-నోటిలో పుండ్లు ఒక్కోసారి ప్రమాదంగా మారతాయి**
**నల్లమల్ల శిల్ప, క్యాన్సర్ నిర్ధారణ వైద్య నిపుణులు**



చెవి లేదా నోటి నొప్పి, మింగడంలో ఇబ్బంది, నోటి లోపల తెలుపు లేదా ఎర్రటి మచ్చలు, పెరుగుదల లేదా గడ్డలు, వదులైన దంతాలు నోటి క్యాన్సర్ లక్షణాలుగా భావించవచ్చు. కనిపించే తీరు, నొప్పిస్థాయి, పరిమాణం మరియు స్థానం, ఇతర లక్షణాలతో నిర్ధారణ పరీక్షలు చేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చు. చాలా నోటి పూతలు సాపేక్షంగా నిరపాయకరమైనవి కానీ నొప్పిని కలిగిస్తాయి. నమలడం, మింగడం ముఖ్యమైన విధులకు అంతరాయం కలిగిస్తాయి. నోటి లోపల పుండ్లు ప్రతిది క్యాన్సర్ కాదు. నోటి గాయాలు, పుండ్లు నయం కాకుండా, నెలలు తరబడి ఉంటే ఖచ్చితంగా వైద్యులను సంప్రదించి ముందస్తు చర్యలు చేపట్టాలి.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో బానోత్ బాలాజీ గాయలపాలయ్యాడు. అలాగే బానోత్ మణిచంద్ర మృతి చెందాడు. కాగా గ్రామస్థులు గాయలపాలైన వ్యక్తికి, మృతుడి కుమార్తెకు రూ.48వేల500 వందలను ఆర్థికసాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌ఫౌండేషన్ నిర్వాహకులు బానోత్ కీమా, తేజావత్ రామోజీ, బిఆర్ఎస్ మండల కార్యదర్శి బానోత్ కృష్ణ, బానోత్ సురేష్, బానోత్ సందీప్, గుగులోత్ రాజ శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ రెండు కుటుంబాలు గ్రామస్థులు దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

## కమ్యూనిస్టు పార్టీకి అంతం లేదు

**-సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**




**ప్రజాపక్షం/ఇల్లందు:** టేకులపల్లి మండల సిపిఐ పార్టీ 13వ మహాసభ సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి అంతం లేదన్నారు. ప్రజలు బూర్జువా పార్టీల పట్ల విముఖత చూపుతూ కమ్యూనిజం వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. ప్రజల సమస్యలే ఏజెండాగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే .సారయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జములయ్య, కొత్తగూడెం పట్టణ నాయకులు రమేష్ , సిపిఐ జిల్లా నాయకులు గూగు లోత్ రామ్ చందర్, మండల నాయకులు అయిత శ్రీరాములు, ఎజు భాస్కర్, గూగు లోత్ శ్రీను, కిర్లపూడి సుందర్ పాల్, ఐల నాగార్జున చారి, డేగల రమేష్, గూగులోత్ సోనీ, రాయల ఇందిరా, వీరన్న, జోగ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు సిపిఐ మండల మహాసభ



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం :** మండల పరిధిలోని గంగోలు గ్రామం వివిఆర్ పంక్షన్ హాల్ లో సిపిఐ 20 వ మండల మహాసభ మండల కార్యదర్శి రావుల పల్లి ర వికుమర్ అద్యక్షతన నేడు జరగ నుంది. ఈ మహాసభకు జిల్లా కార్యదర్శి ఎస్కే సాభీర్ పాషా , రాష్ట కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య లు హాజర్ కానున్నారు. ఈ సభా వేధిక ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ వాగ్ధానాల అమలు కోసం పోరాటాలు నిర్వహించేందుకు ఈ సభాప్రాంగణం వేధిక కావాలని మండల కార్యదర్శి రావుల పల్లి రవికుమారు సోమవారం పిలుపునిచ్చారు. మండ లంలో పోడు సాగు రైతులకు సిపిఐ అండగ నిలిచి పట్టాలు ఇప్పించడంలో కీలక పాత్ర పోసింసిందన్నారు. అయినప్పటికి మరికొంత మందికి పోడు పట్టాలు అందలేదని వారు తెలిపారు. మండలంలో మిగిలిన పోడు సాగు దారులకు పట్టాలు అందేల కృషి చేస్తుందని తెలిపారు.

## ఇల్లందు సబ్ జైలును సందర్శించిన జడ్జి



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు సబ్ జైల్ ను సోమవారం ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి సందర్శించారు. ముందుగా పలు రికార్డులు తనిఖీ చేశారు. ఖైదీలకు మెనూ ప్రకారం సదుపాయాలు అందుతున్నాయో లేవో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సబ్ జైల్ లో పరిశుభ్రత పాటించాలని, ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు ఫ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా న్యాయవాదిని నియమిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపరిండెంట్ ఎన్. చంద్రశేఖర్, సబ్ జైల్ సిబ్బంది కె. శ్రీనివాస్ సాంబ, శాంతి, స్వరూప్, టి నవీన్, లీగల్ ఎయిడ్ న్యాయవాది కీర్తి కార్తీక్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి

**ప్రజాపక్షం/ఏన్కూరు :** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రఫీ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఇమామ్ నగర్ గ్రామ సమీపంలో గల పల్లె ప్రకృతి వనం వద్ద ద్విచక్ర వాహనం, అశోక్ లేలాండ్ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బత్తుల రాజేష్ (30), ఇమ్మడి రఘుపతికి (50) తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు వెంటనే 108 వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మృతుడు రాజేష్ ఖమ్మంలో నివాసం ఉంటూ ఉద్యోగరీత్యా కొత్తగూడెంకు బస్సులో ప్రయాణించేవాడు. సోమవారం ఉదయం తన ద్విచక్ర వాహనంతో ఖమ్మం నుండి బయలుదేరి మార్గమధ్యలో పల్లిపాడు వద్దకు రాగానే రఘుపతి కొత్తగూడెంలో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. రాజేష్ ను లిఫ్ట్ అడిగి ద్విచక్ర వాహనంపై ఇరువురు బయలుదేరారు. హిమామ్ నగర్ గ్రామ సమీపంలోకి రాగానే వారి వాహనాన్ని చండుగొండ మండలం నుంచి అశోక్ లేలాండ్ వాహనం బయలుదేరి వస్తున్న క్రమంలో వీరిరువురి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆకోజ్ సునీల్‌కు ముందస్తు బెయిల్ మంజూరు

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఓ హత్యకేసులో 15 వ నింధితునిగా ఉన్న ఆకోజ్ సునీల్ కు హై కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. మే 7వ తేదిన పట్టణానికి చెందిన కణితి సతీష్‌కు అదే కాలనీకి చెందిన మరికొందరు యువకులకు జరిగిన ఘర్షణలో సతీష్ మృతి చెందిన విషయం విధితమే. ఆ కేసుకు సంబంధించి ఇప్పటికే కొందరు నింధితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 15వ నింధితునిగా ఆరోపిస్తూ పట్టణ పోలీసులు సునీల్‌పై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఉదంతం పూర్తిగా రాజకీయ రంగు పులుముకోవడంతో సునీల్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు న్యాయవాదులు బివి కార్తీక్, ఎండి రిజ్వాన్ నేతృత్వంలో పలుమార్లు ముందస్తు బెయిల్‌దాఖలు చేయగా సోమవారం న్యాయమూర్తి ఆకోజ్ సునీన్‌కు రూ.25వేల పూచికత్తుతో ముందస్తు బెయిల్ మంజూరు చేశారు.